# క్లబ్

క్లబ్‌లో రంగడు హడావిడిగా తిరుగుతున్నాడు. ఆఫీసర్స్ వచ్చే టైమయింది. అన్నీ రెడీచేసి పెట్టాలి. కుర్చీలు, టేబుల్స్ సర్దసాగాడు. “ఇది కలెక్టర్ సాబ్, ఎస్ పి. సాబ్ కూర్చునే టేబుల్....చాలా జాగ్రత్తగా తుడవాలి. ఎక్కడ ఏ కొంచెం నలుసు కనిపించినా ఎస్.పి. సాబ్ మండిపడ్తారు” అనుకుంటూ చకచకా టేబుల్స్, కుర్చీలు తుడవసాగాడు.

క్లబ్ హాలునిండా ఓ యేడెనిమిది పెద్ద పెద్ద రౌండ్ టేబుల్స్ వున్నాయి. ఆ టేబుల్స్ చుట్టూ చక్కగా ఓ ఆర్డర్‌లో కుర్చీలు వేశాడు. ఆ కుర్చీలమీద కూర్చుని ఆఫీసర్సంతా రమ్మీ ఆడ్తారు.

రంగడు పక్కనే వున్న మరో హాలులో ప్రవేశించి బిలియర్డు టేబుల్ తుడవసాగాడు. ఆ హాలులోనే టేబుల్ టెన్నీస్ టేబుల్ కూడా వుంది. ఓ మూల టెన్నీస్ బంతులు, రాకెట్స్, క్యారమ్స్ బోర్డు పడి వున్నాయి. క్లబ్ బిల్డింగ్ పక్కనే టెన్నీస్ కోర్టు కూడా వుంది. కాని అది శిధిలావస్థలో వుంది. ఆ క్లబ్‌కి వచ్చేవాళ్ళల్లో నూటికి తొంభై తొమ్మిది మంది రమ్మీ ఆడేవాళ్ళే.

క్లబ్ గడియారం యేడుగంటలు కొట్టింది.రంగడు ఉలిక్కిపడ్డాడు. యేడుగంట లయ్యిందంటే ఒక్కొక్కరే వస్తుంటారు. యేడున్నర, ఎనిమిదింటి వరకు క్లబ్బంతా నిండిపోతుంది. ఆ తర్వాత తనకు క్షణం తీరికుండదు. 'రంగా' “రంగడూ” అన్న కేకలు ప్రతి టేబిల్ దగ్గర నుండి వినిపిస్తాయి. ఒకరు సిగిరెట్స్ తెమ్మంటారు. మరొకరు కాఫీ తెమ్మంటారు. ఇంకొకరు కూల్‌డ్రింక్స్, ఇంకా కొందరు హాట్ డ్రింక్స్ అంటారు. అంటూ తన చేతికి పది రూపాయలనోట్లు, వంద రూపాయల నోట్లు ఇస్తుంటారు. ఆ డబ్బంతా తీసుకుని బజారు వెళ్ళాలి. ఎవరికేం

కావాలో జ్ఞాపకంఉంచుకొని తీసుకురావాలి.ఎవరెవ్వరికి ఎంత చిల్లరివ్వాలో ఇవ్వాలి. లెక్కలో నయాపైసా తేడా వచ్చినా తనమీద విరుచుకుపడ్తారు. పుల్ కౌంటిచ్చినప్పుడు వందలకు వందలు పోగొట్టుకుంటే పరవాలేదు- తన దగ్గరనుంచి మాత్రం పైసాకూడా తేడా రావటానికి వీల్లేదు. ఏ టేబుల్ దగ్గర చూసినా డబ్బు....కుప్ప తెప్పలుగా పడివుంటుంది. వంద లకు వందలు చేతులు మారుతుంటాయి. అంత డబ్బు వాళ్ళకు ఎక్కడ నుంచి వస్తుందో తను ఊహించలేడు.

బయట స్కూటర్ చప్పుడైంది.

వచ్చేది రంగనాథరావని రంగడికి తెలుసు.

"యేరా రంగడూ, ఇంకా ఎవళ్ళూ రాలేదూ" అంటూ చక్కా వచ్చాడు రంగనాథరావు. రంగనాథరావు ఆ వూరి కాలేజీలో పనిచేస్తున్న లెక్చరర్, క్లబ్‌కు అందరికంటె మొదలువచ్చేది రంగనాథరావే.రంగనాథ రావుకు చచ్చేంత రమ్మీ పిచ్చివుంది. తిండి,నీరు,గాలి మొదలైనవి లేకుండా బతక్కలడేమోగాని రంగనాథరావు రమ్మీ ఆడకుండా ఒక్కరోజు కూడా బతకలేడు. ఎవళ్ళూ దొరక్కపోతే వాళ్ళావిడను బలవంతం చేసి రమ్మీకి కూర్చోబెడతాడు. వాళ్లావిడ కూడా లేకపోతే తనొక్కడే ఆడుకుంటాడు. ఆయన్ని ఆయన ఫ్రెండ్సందరూ 'రమ్మీనాథరావు' అని పిలుస్తారు.అలా పిలిచినప్పుడు అతడు చాలా సంతోషిస్తాడు.

"ఇంకా యెవరూ రాలేదు సార్" అన్నాడు రంగడు.

రంగనాథరావు లెక్చరర్స్‌కు ప్రత్యేకించిన టేబుల్‌దగ్గర కూర్చుంటూ జేబులోంచి పదిరూపాయల నోట్లకట్టొకటి బయటకు తీశాడు. అంత డబ్బు చూడగానే రంగడికి "ఈరోజు ఫస్టుఅన్నసంగతి గుర్తుకొచ్చింది. రంగడికి ఓ పదిరూపాయల నోటు అందిస్తూ.

"బజారుకెళ్ళి ఓ ప్లేయర్స్ పాకెట్ తీసుకురారా" అన్నాడు రంగనాథరావు. రంగడు పదిరూపాయల నోటు అందుకొని బయటపడ్డాడు. "ఇంత సేపూ ఈయన బజారునుండే వచ్చాడుగదా! ఓ సిగిరెట్ ప్యాకెట్ తెచ్చుకుంటే యేంపోయిందో....రంగనాథరావు చిత్రమైన మనిషి. జీతం తీసుకున్న మొదటి రోజుల్లో ప్లేయర్స్ తాగుతాడు. తర్వాత అది బర్కిలీకి దిగుతుంది. ఆఖరు రోజుల్లో చార్మినార్ కూడా తాగుతాడు లేక ఏరోజైనా

రమ్మీలో కొంచెం గిట్టుబాటయిందంటే ఆరోజు మళ్ళీ ప్లేయర్సోడా క్యాప్స్టన్తో తాగుతాడు. కాని రంగనాథరావుకు రమ్మీలో ప్రతిరోజు కొంత క్షవరం కావటమేకాని గిట్టుబాటంటూ ఉండదని తనకు బాగా తెలుసు.

ఇవ్వాళ ఫస్టు తనకుకూడా ఈరోజు జీతంరావాలి. క్లబ్ సెక్రటరీ ఈ రోజు వస్తే, మెంబర్సంతా నెలనెలా యివ్వాల్సిన 10 రూపాయలు ఇస్తే తనకు జీతం వస్తుంది. తన జీతం ఇంత అని యేంలేదు. ఒక నెల 50 ఓ నెల చాలామంది మెంబర్స్ డబ్బివ్వలేదన్న కారణంతో అది 40 కో, 30 కో దిగుతుంది. ఎంతిచ్చినా తీసుకోవాల్సిందే. నోరు మెదపటానికి వీల్లేదు. ఎస్.పి. కలెక్టర్, కలెక్టర్ భార్య, లక్షాధికారి అశోక్‌రెడ్డి మొదలైన గొప్ప గొప్పవాళ్లు రోజూ క్లబ్‌కొచ్చి నానా హంగామా చేస్తారేగాని వాళ్లు నెలనెలా ఇవ్వాల్సిన పదిరూపాయలు మాత్రం ఇచ్చేది లేదు. ఆ క్లబ్ సెక్రటరీకి వీళ్ళదగ్గరకెళ్ళి అడగాలంటే చచ్చే భయం.

తనకీరోజు జీతం వస్తే ట్యుటోరియల్ కాలేజీ ఫీజు కట్టాలి. ఈ సారన్నా తప్పకుండా ప్యాసుకావాలి. రంగడు ఇప్పటికి ఆంధ్రా మెట్రిక్ రెండుసార్లు తప్పాడు. మూడోసారి కూర్చోబోతున్నాడు. రంగడికి అమ్మ, ఇద్దరు తమ్ముళ్లు, ఓ అక్కా వున్నారు. తమ్ముళ్ళిద్దర్ని చదివించాలని అమ్మ పట్టుదల. ఐదారుగురు ఇళ్లల్లో పనిమనిషిగా వుంటూ అమ్మ నెలనెలా కొంత సంపాదిస్తుంది. అక్కకు ఏనాడో పెళ్ళయింది. తమ్ముళ్ళిద్దర్నీ ఈ యేడు హైస్కూల్లో వేశారు.

రంగడికి క్లబ్‌బోయ్ జీవితంమీద రోజు రోజుకు రోతపుడుతోంది. రోజూ యెవరో ఒకరితో తన్నులు తినక తప్పటంలేదు. యెలాగో ఆంధ్రా మెట్రిక్ ప్యాసై రాత్రి కాలేజీలో చేరిపోవాలని వాడు చాలా కాలంగా అనుకుంటున్నాడు.

రంగడు బజారునుండి తిరిగివచ్చేటప్పటికి లెక్చరర్ టేబుల్‌మీద రమ్మీ సాగుతూనే ఉంది. ప్రతాపరెడ్డి, మోహనరావు, సాంబయ్య, రంగనాథరావుతో కలిసి నల్గురూ రమ్మీ ఆడుతున్నారు. అందరూ లెక్చరర్సే.

ప్రతాపరెడ్డి ఆ క్లబ్‌కు ప్రతిరోజు తప్పకుండా వచ్చే వాళ్లల్లో ప్రముఖుడు. అతనికి రమ్మీ సరదా మాత్రమే కాదు. ఓ సైడ్ బిజినెస్

లాంటిది. ప్రతిరోజూ అతడు పేకాటమీద కనీసం పది రూపాయలకు తక్కువ కాకుండా సంపాదిస్తాడు. ఏ రోజన్నా క్లబ్‌కు రాలేదంటే అతడు పదిరూపాయలు కోల్పోయాడన్నమాట. కాబట్టి ఎంతో తప్పనిసరి అయితే తప్ప ప్రతాపరెడ్డి క్లబ్‌కి రాకుండా వుండడు. ఏ రోజన్నా వంట్లో బాగాలేదని ఇంట్లో వుంటానంటే వాళ్లావిడ వప్పుకోదు. అతన్ని యెన్ని ప్రయత్నాలు చేసైనా క్లబ్‌కు పంపించందే వాళ్లావిడ ఊరుకోదు.

సాంబయ్య ఈ మధ్యనే ఎం. ఏ. ప్యాసై లెక్చరర్‌గా చేరాడు. నిజానికి సాంబయ్యకి రమ్మీ ఆడటంలోని కిటుకులేవీ ఇంకా తెలీదు. ఫూలిష్‌గా ఆడుతూ పక్కవాడికి చాలా లాభం కలిగిస్తుంటాడు. రోజూ బాగానే పోగొట్టుకుంటాడు. అతనికింకా పెళ్ళికాలేదు. ఒక్కడేకాబట్టి ఎంత పోగొట్టుకున్నా, అతనికి బాగానే గడుస్తుంది. రేపు పెళ్లయితే యే పదివేలో కట్నం వచ్చి ఈ నష్టమంతా పూడుతుందిలే అనుకుంటుంటాడితడు. సాంబయ్య రోజూ క్లబ్‌కు రావటానికి కారణం ప్రతాపరెడ్డి "ఇంట్లో కూర్చుని యేం చేస్తావు క్లబ్‌కువస్తే టైమ్ చక్కగా గడుస్తుంది టౌన్‌లోని ఆఫీసర్సంతా పరిచయమౌతారు. ఎస్. పి, కలెక్టర్ మొదలైన వాళ్లంతా మనకు ఫ్రెండ్స్ అవుతారు." అనిచెప్పి సాంబయ్యను రోజూ తనతో తీసుకువస్తాడు. ప్రతాపరెడ్డి సాంబయ్యను అంత శ్రద్ధతో రోజూ క్లబ్‌కు తీసుకురావటానికి వేరే కారణముంది. సాంబయ్య కోల్పోయే డబ్బులో చాలా భాగం ప్రతాపరెడ్డికే వస్తుంది. తన టేబుల్ దగ్గర ఆడేవాళ్ళల్లో ఎంతమంది "ఫూలిష్ ప్లేయర్స్" వుంటే తనకంత లాభమని ప్రతాపరెడ్డికి తెలుసు.

ఇక మోహన్‌రావు- మోహన్‌రావు చాలా కాలంగా ఆ వూళ్ళో లెక్చరర్‌గా ఉంటున్నా అతడు ఈమధ్యనే క్లబ్‌కు వస్తున్నాడు. అయినా అతడు రోజూ వస్తాడని చెప్పలేం. ఎప్పుడో ఎటూ తోచకపోతే క్లబ్ వైపు వస్తాడు- మోహనరావు ఎం.ఏ ప్యాసై లెక్చరర్ అయిన కొత్తలో అతనికి చాలా గొప్ప ఆదర్శాలుండేవి. ఏమేమో చెయ్యాలని స్టూడెంట్స్‌ని బాగుచెయ్యాలని కలలు గన్నాడు. కాని అతని కలల్ని నిజాలుగా మార్చుకోబోయి చాలా ఎదురుదెబ్బలు తిన్నాడు. స్టూడెంట్స్‌ని బాగుచేసే ప్రయత్నంలో వాళ్ళే అతన్ని బాగుచేయడంతో ముగిసింది.

త్వరలోనే అతడు ఈ దేశంలో కష్టపడి పనిచేస్తూ ఏవో గొప్ప ఫలితాలు సాధిద్దామనుకునే వాడికి చోటులేదని తెలుసుకున్నాడు. అంతేగాకుండా అతనికి ఇంతకుముందు లెక్చరర్స్ వృత్తిమీదున్న గౌరవం తన చుట్టూవున్న లెక్చరర్స్‌ను చూశాక పోయింది. త్వరలోనే మోహనరావు ఓ సినిక్ అనే బిరుదు పొందాడు. ఒక సినికల్ ప్లెజర్ (Cynical pleasure) కోసమే అతడు అప్పుడప్పుడు క్లబ్‌కు వస్తుంటాడు.

నెమ్మదిగా క్లబ్బులోని టేబుల్స్ అన్నీ నిండసాగాయి. ఆ రోజు ఫస్టు కావటంవల్ల ప్రతివాడు చాలా ఉత్సాహంగా క్లబ్‌కు వస్తున్నారు. డాక్టర్లు, లాయర్లు, క్లర్కులు, టీచర్స్, వి. ఐ. పి. లు ఇలా ఒక్కొక్క తరగతికి అక్కడ ప్రత్యేకమైన టేబుల్స్ ఉన్నాయి. ఆ క్లబ్‌లో అన్నిటికంటె మొట్టమొదట లెక్చరర్స్ టేబుల్ దగ్గరే రమ్మీ స్టార్టు అవుతుంది.

"అసలు ఈ లెక్చరర్స్‌కు జీతాలు దండగ - వీళ్ళకి పనిపాటా ఉండదు. యేడాది పొడుగునా స్ట్రైకులో, సెలవులోతప్ప వీళ్ళు పాఠంచెప్పి యేడ్చిందెప్పుడు" అనుకుంటారు మిగతా టేబుల్స్ వాళ్ళు.

లెక్చరర్స్ టేబుల్ దగ్గర ఆట పుంజుకోసాగింది. ప్రతాపరెడ్డి అప్పుడే రెండుసార్లు రమ్మీ చేశాడు.

"ఇవ్వాళ మీ క్లాసులో ఏదో గొడవయిందట" అన్నాడు మోహనరావు సాంబయ్య నుద్దేశించి.

"గొడవా! అప్పుడే మీకెవరు చెప్పారు" అన్నాడు సాంబయ్య కొంచెం చిరాగ్గా. తన క్లాసులో గొడవ జరిగిందని ఒప్పుకోవటం యే లెక్చరర్‌కైనా కొంచెం చిన్నతనంగా ఉంటుంది.

"అట్లాంటివి ఆగవులెండి. ఇంతకూ ఏమయ్యిందో మీ వెర్షన్ చెప్పండి" అన్నాడు రంగనాథరావు.

"నా వెర్షన్ ఏముందిలెండి. నేను క్లాసుకు వెళ్ళగానే వెధవలెవరో ఆడపిల్లలమీద ఏవో బూతులు రాశారు. నేను అవి చెరిపేస్తూ బాగా దులిపేశాను. రాస్కెల్స్ కొందరు బయటకెళ్ళిపోయి క్లాసు బయట పెద్ద Noise చేశారు. దట్సాల్" అన్నాడు సాంబయ్య జరిగిందాన్ని సాధ్యమైనంత తక్కువచేసే ప్రయత్నంలో.

"ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చెయ్యకపోయారా !" అన్నాడు రంగనాథ రావు.

"ఈ మాత్రందానికి ప్రిన్సిపాల్‌దాకా ఎందుకులెండి. అయినా వాడేం చేస్తాడని. ఏమైనా యాక్షన్ తీసుకుంటాడనా ? ఇట్లాంటివి వాడి దగ్గరకు తీసుకెడితే మనమే ఏదో తప్పు చేసినట్టు మనమీద చిందులు తొక్కుతాడు" అన్నాడు ప్రతాపరెడ్డి.

"ఆ బోర్డుమీద రాసిన ఆడపిల్లల పేరుతోపాటు మీ పేరుకూడా ఉందని విన్నాం. ఏమైనా, మిష్టర్ సాంబయ్యా! మీరా జలజ ఇంటికి ట్యూషన్ చెప్పటానికెళ్ళటం ఏమి బాగాలేదు. కాలేజీ గోడల మీద ఎక్కడచూసినా మీ పేర్లు కనిపిస్తున్నాయి" అసహ్యంగా అన్నాడు మోహనరావు.

"ఏమిటిసార్ మీరుకూడా అలాగే మాట్లాడుతారు. నాపేరు గోడల మీద కెక్కటానికి కారణం నేను జలజ ఇంటికి ట్యూషన్ చెప్పటానికి వెళ్ళటంకాదు. అసలు దీని కంతటికి కారణం ఆ సెకండియర్ బి. ఏ.లో వుంటాడే వాడే గోవిందరావు....వాడూ కారణం. వాడు నా దగ్గరకు ఓ నెలరోజులు అటెండెన్స్ వేయమని వచ్చాడు. నేను వేయనిన నిక్కచ్చిగా చెప్పాను. అప్పట్నించి వాడు నామీద పగపట్టాడు. వాడే ఈ చెత్తంతా రాస్తున్నాడు. వాడ్నిగూర్చి ప్రిన్సిపాల్‌కు రెండు మూడుసార్లు చెప్పాను. కాని వాడో మోస్ట్‌హోప్‌లెస్‌ఫెలో....యాక్షన్ తీసుకునే గట్స్ వాడికెక్కడివి" అన్నాడు సాంబయ్య విసుగ్గా.

"యాక్షన్ తీసుకోవటమే !—మన ప్రిన్స్‌పాల్ యాక్షన్ తీసుకుంటే ఇంకేమైనా ఉందా ? స్టూడెంట్స్ అంటే చచ్చే భయం వాడికి? ఎటొచ్చీ మనమీద పడ్తాడు. మొన్న చూడండి నిష్కారణంగా నాకు మెమో ఇచ్చాడు" అన్నాడు రంగనాథరావు.

"టుబి ఫ్రాంక్....నీకు నిష్కారణంగా మెమో ఇచ్చాడా! మీరు లేట్‌గావచ్చి ఫైనలియర్ క్లాసు కాన్సిల్ చేసినందుకా ?" అన్నాడు మోహనరావు.

"యేమిటండీ....మీరుకూడా నేను క్లాసు కాన్సిల్ చేశానంటున్నారు. ఆ వెధవలే వచ్చి మాకు క్లాసొద్దు సార్....ఇంటికి పోతామంటే నేను

వెళ్ళిపొండిరా అన్నాను....అంతే. ఇది క్లాసు కౌన్సిల్ చెయ్యట మౌతుందా ?" అన్నాడు రంగనాధరావు.

"యేమో మరి. ఆ విషయం ఇండియన్ సుప్రీంకోర్టు తేల్చాలి" అన్నాడు మోహనరావు.

ఇంతలో ప్రతాపరెడ్డి మరోసారి రమ్మీ చేశాడు. ఎవరెవరు ఎన్ని పాయింట్లో లెక్క పెట్టారు.

"మా వాళ్ళు ఎవళ్ళూ రాలేదు, కాసేపు మీ టేబుల్ మీద కూర్చోనా సార్" అంటూ వచ్చాడు నర్సయ్య. ఆ నర్సయ్య ఆ ఊరి హైస్కూల్లో టీచర్. నర్సయ్యకుకూడా రమ్మీ పిచ్చి విపరీతంగా ఉంది. ఇల్లు, వాకిలి, పెళ్ళాం, పిల్లలు అందర్నీ అమ్ముకునే స్థితికి వచ్చినా అతడు రమ్మీ ఆడకుండా ఉండలేడు. తల్లిదండ్రులు సంపాదించిపోయిన ఆస్తంతా అమ్మేశాడు. పెళ్ళాం ఒంటిమీద నగలన్నీ అమ్మేశాడు. క్లాసు టీచరుగా పిల్లల దగ్గర వసూలు చేసే ఫీజంతా రమ్మీమీద తగలేసి నప్పుడు జైలుకు పోయేంత పనయ్యింది. హెడ్‌మాస్టరు దయతలచి తర్వాత నెలజీతంలో కోసుకుంటానని వదిలేశాడు. మొదట్లో నర్సయ్య రోజూ క్లబ్‌కొచ్చేవాడు కానీ ఈ మధ్య ఫస్టునాడు, ఆ తర్వాత ఒకరోజు తప్ప తర్వాత రావటంలేదు. పాపం ఈ మధ్య అతని దగ్గర ఫస్టునాడు తప్ప మిగతా రోజుల్లో బొత్తిగా డబ్బులుండటంలేదు.

నర్సయ్యను తన టేబుల్‌మీద కూర్చోనిచ్చారు. ఓ టీచర్ తన పక్కన కూర్చొని రమ్మీ ఆడుతుంటే సాంబయ్యకు రంగనాథరావుకు ముళ్ళమీద కూర్చున్నట్లుగా ఉంది. కాని ప్రతాపరెడ్డికి మాత్రం హాయిగా ఉంది. నర్సయ్యలాంటివాడు తన టేబుల్‌మీదకూర్చున్నాడంటే నర్సయ్య జేబులోని డబ్బంతా తన జేబులోకి వస్తుందని ప్రతాపరెడ్డికి తెలుసు.

నర్సయ్యకుకూడా కార్డ్సు వేశారు.

క్లబ్బంతా కోలాహలంగా ఉంది. "రంగడూ" "రంగా"అన్న కేకలు క్లబ్‌నిండా ప్రతిధ్వనిస్తున్నాయి. డాక్టర్ల టేబుల్ దగ్గర అయిదారుగురు కూర్చున్నారు. క్లర్కు టేబుల్ నిండింది. లాయర్ల టేబుల్‌దగ్గర 'కోరమ్ ఫుల్ అయ్యింది. అంతా ఒకరొకరు హల్లో, హల్లో అంటూ విష్‌చేసు కుంటున్నారు. వి. ఐ. పి.ల టేబుల్ యింకా నిండలేదు. వి. ఐ. పి.ల్లో

ఒక్క అశోక్‌రెడ్డి మాత్రమే వచ్చాడు. అశోక్‌రెడ్డి ఆ వూళ్ళోకల్లా ధన వంతుడు. కంట్రాక్టర్‌గా లక్షలు ఆర్జించాడు. మొదట్లో అశోక్‌రెడ్డి కుటుంబం మామూలు మధ్య తరగతి కుటుంబమే. అశోక్‌రెడ్డి ఆ రోజుల్లో H.S,C. దాకా చదివి ఫెయిలయి చదవటం మానేశాడు. స్వాతంత్ర్యం వచ్చి పంచవర్ష ప్రణాళికలు మొదలయ్యాక అశోక్‌రెడ్డి స్టార్ తిరిగింది. కొందరు రాజకీయ నాయకులతో స్నేహంచేసి ఓ చిన్న కంట్రాక్టర్‌గా అతడు స్టార్టు అయ్యాడు. త్వరలోనే లక్షాధికారి అయ్యాడు. అతనితో స్నేహంచేసిన రాజకీయ నాయకులు మంత్రులయ్యారు. ఆ ఊళ్లో అతని స్టేటస్ అతని మూడంతస్తుల మేడతోబాటు విపరీతంగా పెరిగిపోయింది.

అశోక్‌రెడ్డి క్లబ్బులోకొచ్చి ఒకసారి అన్ని టేబుల్స్‌ను పరికించి చూశాడు. తనతో రమ్మీ ఆడగల స్టేటస్ ఉన్నవాడు వాళ్ళల్లో ఎవడూ కనిపించలేదు. రంగా అని కేకేశాడు. క్షణంలో రంగడు అతని ముందు కొచ్చి వాలాడు.

"కలెక్టర్‌గాని, ఎస్. పి. గాని, ఇంజనీర్‌గాని వస్తే నాకు వెంటనే చెప్పు. నేను బిలియర్డ్సు రూమ్‌లో ఉంటాను" అంటూ అశోక్‌రెడ్డి పక్క హాల్లోకి వెళ్ళిపోయేడు. అక్కడ రమ్మీ ఆడుతున్న చాలామంది అతనికి లేచి నమస్కారం చేశారు.

లెక్చరర్స్ టేబుల్‌దగ్గర ఈసారి రంగనాథరావు రమ్మీ చెయ్యటం అందర్నీ ఆశ్చర్యపరిచింది. నర్సయ్య ఫుల్‌కౌంటివ్వటం మాత్రం ఎవర్నీ ఆశ్చర్యపరచలేదు.

"ఇవ్వాళ మనవాడు క్లబ్‌కురాలేదే" అన్నాడు ప్రతాపరెడ్డి. "మన వాడు" అంటే వాళ్ళ ప్రిన్సిపాల్ అని అక్కడ అందరికీ తెలుసు.

"ఎందుకు నాయనా? వాడొస్తే మనం రమ్మీచేస్తే వాడు డబ్బు లివ్వడు. వాడు చేస్తేనేమో మనదగ్గర ప్రతిపాయింటు లెక్కగట్టి డబ్బు తీసుకుంటాడు. వాడిని మనం గట్టిగా అడగలేం." అన్నాడు రంగనాథ రావు.

"వీడ్ని ఎలాగైనా ఇక్కణ్ణించి ట్రాన్స్ఫర్ చేయించే మార్గం లేదా?" అన్నాడు సాంబయ్య.

"ఎందుకు లేదు. ఉంది. దేనికైనా కాలం రావాలి. పాపం పండాలి. అయినా ఈ ఊళ్లో వాడి రోజులు దగ్గర పడ్తున్నాయిలెండి. వీడిమీద డైరెక్టర్ దగ్గరకు ఆకాశరామన్న ఉత్తరాలు వెళ్ళాయి. స్టూడెంట్స్ కూడా వీడంటే మండుతున్నారు" అన్నాడు ప్రతాపరెడ్డి.

"ఊరికే వాడిమీద నోరు పారేసుకోవటం దేనికిగాని మనమేమన్నా మన ప్రొఫెషన్‌కు న్యాయం చేస్తున్నామా? ట్యూషన్ తీసుకోవద్దని అతడంటాడు. మనం తీసుకుంటున్నాము. తీసుకోవటమేనా? మన దగ్గర ట్యూషన్ చదివినవాళ్ళను పరీక్షల్లో కాపి చేసుకోనిస్తున్నాము. వాళ్ళకు ఆన్సర్స్ తెచ్చి అందిస్తున్నాము. డబ్బులు తీసుకొని వాళ్ళకు పరీక్షల్లో మార్కులు వేయిస్తున్నాము. అర్ధరాత్రి దాటేదాకా క్లబ్‌లో పేకాడి తెల్లారి నిద్రమత్తు మొహాలతో క్లాసుకెళ్ళి యేదో చెత్త వాగి ఏస్తున్నాము. మనం ఇంత అధ్వాన్నంగా తయారై ప్రిన్స్‌పాల్‌ను తిట్టటంలో అర్థంలేదు." అన్నాడు మోహనరావు.

"మొత్తానికి ఎంత చేతులు కాల్చుకున్నా మోహనరావు ప్రిన్స్‌పుల్స్ మాట్లాడటం మాత్రం మానుకోడు" అన్నాడు రంగనాథరావు. ఈసారి కూడా రంగనాథరావే రమ్మీ చేశాడు.

"ఇదేమిటి వీడివ్వాళ ఇంత క్విక్‌గా రమ్మీ చేసేస్తున్నాడు. యేదో ఉంది" అనుకున్నాడు ప్రతాపరెడ్డి, నర్సయ్య మళ్ళీ చాలాడబ్బు పోగొట్టుకున్నాడు. రంగనాథరావు యేదో "మెస్మరిజం" చేసి రమ్మీ చేస్తున్నాడని ప్రతాపరెడ్డికి అనుమానం కల్గింది.

"యేం నర్సయ్యా... క్లబ్‌కు వచ్చినప్పుడల్లా ఇంత డబ్బు పోగొట్టుకుంటావు. నీకు నెలంతా ఎలా గడుస్తుందయ్యా" అన్నాడు మోహనరావు.

నర్సయ్యకు ఆ ప్రశ్న చాలా ఇబ్బందిగా ఉంది.

"ఎలాగో గడుస్తుంది లెండి" అంటూ వెల వెల బోతున్న మొఖాన్ని కార్డ్సుచాటుకు దాచుకునే ప్రయత్నం చేశాడు.

"వాళ్ళ కేమిటయ్యా ట్యూషన్స్ మీద బోలెడు డబ్బు సంపాదిస్తున్నారు. నిజానికి మన కంటే ఈ టీచర్సే నయం" అన్నాడు ప్రతాపరెడ్డి.

"మన పేరే పెద్దది. ఎం. ఏ లం ఇంటలెక్చువల్స్ము, కాని మన కంటె మెట్రిక్‌లేట్ టీచర్సేనయం. ఈయన్ను చూడండి. జస్ట్ మెట్రిక్ లేట్—మనతో సమానంగా కూర్చొని రమ్మీ ఆడుతున్నాడు" అన్నాడు సాంబయ్య.

"ఆహా! మనం 'ఇంటలెక్చువల్స్‌మా' మనం ఇంటలక్చువల్స్ము అయితే ఆ మాటను డిక్షనరీలో అర్థం మార్చాల్సి ఉంటుంది" అన్నాడు మోహనరావు కసిగా.

"అంటే మీ ఉద్దేశం" అన్నాడు సాంబయ్య-

"నా ఉద్దేశం మీ కర్థం కాదులెండి" అన్నాడు మోహన్‌రావు.

నర్సయ్య వీళ్ళ మాటలేవీ వినిపించుకోవటంలేదు. అతనికి ఈసారి కూడా మంచి కార్డు రాలేదు. కనీసం "సేఫ్" అయ్యేట్లుగా కూడాలేదు.

క్లబ్ గడియారం తొమ్మిది గంటలు కొట్టింది.

క్లబ్‌లో ఒక్క వి.ఐ.పి. టేబుల్‌తప్ప మిగతా టేబుల్స్ అన్నీ నిండాయి.

## 2

డాక్టర్స్ టేబుల్ దగ్గర రమ్మీ జోరుగా సాగుతోంది.

ఈ మధ్యనే ఎం. బి. బి. ఎస్. ప్యాసై ఆ టౌన్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు డాక్టరుగావచ్చిన సంతోష్‌రెడ్డి ఆ ఊళ్లో చాలా కాలంగా ప్రాక్టీస్‌చేస్తూ వేలకువేలు గడించిన డాక్టరు నరసింహారావు, హెల్త్ మినిస్టర్‌కు చాలా దగ్గర బంధువైన డాక్టరు ఆనందరావు పెద్ద డిగ్రీ లున్నా ప్రైవేటు పేషంట్సులేని డాక్టర్ కృష్ణమూర్తి ఆ టేబుల్ దగ్గర రమ్మీ ఆడుతున్నారు.

"సరేగాని డాక్టర్ ఆనందరావుగారూ—ఇవాళ మీకు నైట్ డ్యూటీ వున్నట్టుందే—ఇలా వచ్చేశారు" అన్నాడు కృష్ణమూర్తి.

"వెధవ నైట్ డ్యూటీ....రాత్రంతా ఎలా గడుపుతా మక్కడ? పెద్ద సీరియస్ కేసేమీలేదు. యేదన్నా వస్తే నర్స్ చూసుకుంటుంది—" అన్నాడు ఆనందరావు నిర్లక్ష్యంగా.

"అదీ సంగతి రోజు రోజుకు ఈ దేశంలో అన్యాయాలు పెచ్చు పెరిగి పోతున్నాయని అంటూనే మనం చేసిన పని ఇది. నైట్ డ్యూటీ ఎగేసి క్లబ్‌కొచ్చి రమ్మీ ఆడటం" అన్నాడు కృష్ణమూర్తి. ఆ టేబుల్ దగ్గర కూర్చునే వాళ్ళకు కృష్ణమూర్తి ఎప్పుడూ ఒక కొరకరాని కొయ్యే అవుతాడు. "ఈయనకు పేషంట్స్ లేరు అందుకని మా ప్రాణాలు తీస్తుంటాడు" అనుకుంటారు మిగతా డాక్టర్లంతా.

"యేమిటయ్యా నే నేదో పెద్ద అన్యాయం చేసినట్టు మాట్లాడు తున్నావు. నేను అక్కడ లేనంత మాత్రాన ఏమౌతుందంటావు. యేదన్నా అవసరం అయితే నర్స్ చూసుకుంటుంది. లేక ఎవడన్నా చస్తాడంటావా! చావనీయ్—చచ్చేవాళ్ళను ఎంత డాక్టర్లమైనా మనం బతికించగలమా చెప్పండి!" అన్నాడు ఆనందరావు చిరాగ్గా.

"ఔనౌను—చచ్చేవాళ్ళను మనమేం బతికిస్తాం నెల నెలా గవర్న మెంటు ఇచ్చే జీతం తీసుకొని, డబ్బున్న పేషెంట్సును ఇంటిదగ్గరకు రప్పించి వాళ్ళ దగ్గర డబ్బుతీసుకొని మన బతుకు మనం చూసుకోవాలి. వేరేవాళ్ళను మనమేం బతికిస్తాం" అన్నాడు కృష్ణమూర్తి.

"అయ్యా! నీ ధోరణి మాకు తెలిసిందే—రమ్మీ అయింది— ఎన్ని పాయింట్లో లెక్కపెట్టండి." ఆనందరావు కార్డ్సు కిందేశాడు.

ఎవరెంత ఇవ్వాలో లెక్కలు కట్టారు.

"ఈ మధ్య మన బాస్ క్లబ్‌వైపు రావడం లేదే" అన్నాడు సంతోష్‌రెడ్డి.

"ఆయనెక్కడొస్తాడు. ఆయన ఏక్టివిటీస్ చాలా ఎక్కువైపో యాయి. గుళ్ళో లింగాన్ని మింగాడు. ఇప్పుడు గుడినే మింగే ప్రయ త్నంలో ఉన్నాడు" అన్నాడు కృష్ణమూర్తి.

"అంటే నా కర్థం కాలేదు. అన్నాడు సంతోష్‌రెడ్డి.

"కొత్తవాడివి, ఇంకా కొంత కాలం పోతే అర్థం అవుతుందిలే." అన్నాడు కృష్ణమూర్తి.

"ఏమిటో చంపక చెప్పండిసార్"—సంతోష్‌రెడ్డి.

"ప్రతీ రోజు అర్ధరాత్రుళ్ళు మన బాస్ ఒక బ్రహ్మాండమైన కార్యక్రమంలో నిమగ్నమై ఉంటాడని తెలుస్తోంది. హాస్పిటల్ కోసం

వచ్చిన మందులన్నీ ఈ ఊరి మెడికల్‌షాప్స్‌లోకి చేరవేసే కార్యక్రమం అది" అన్నాడు కృష్ణమూర్తి.

"ఆఁ" అని నోరు తెరిచాడు సంతోష్‌రెడ్డి.

నరసింహారావు ముసిముసిగా నవ్వాడు.

"హాస్పిటల్‌మీద లక్షలకొద్దీ ఖర్చు పెడుతోంది గవర్నమెంట్.కాని హాస్పిటల్లో జాయిన్ అయిన పేషంటుకు మాత్రం వాడి రోగానికి సంబంధించిన మందుండదు. యేవో రంగునీళ్ళు వాడి మొహాన పోస్తున్నాము. రాసిస్తే డబ్బున్నవాడు బజార్లో కొనుక్కుంటాడు. కాని డబ్బులేనివాడి గతి ? ఇంటికొచ్చి మనకేదో సమర్పించుకుంటే తప్ప మనం హాస్పిటల్లో వాడి మొహమే చూడం. నిజంగా ఈ దేశంలో పేదవాడికి జరుగుతున్న అన్యాయాల్ని తల్చుకుంటే గుండెలు తరుక్కుపోతాయి." అన్నాడు కృష్ణమూర్తి ఆవేశంగా.

"ఏమిటయ్యా—మాట్లాడితే 'పేదవాడు', 'పేదవాడు' అంటావు. నన్నడిగితే ఈ దేశంలో పేదవాడే హాయిగా బతుకుతున్నా డంటాను. వాడి కేమిటి—మనకుండే సమస్యలేమైనా వాడికుంటాయా? పొద్దున్న లేస్తే మనకెన్ని సమస్యలు? మంచి తిండి కావాలి. మంచి ఇల్లు కావాలి. పెళ్ళానికి మంచి చీరలు కావాలి పిల్లల్ని కాన్వెంటులో చదివిస్తూ వాళ్ల మీద బోలెడు డబ్బు ఖర్చు పెట్టాలి. క్లబ్‌కొచ్చి రమ్మీ ఆడాలి. పదో పాతికో, వందో పోగొట్టుకొని నెత్తిగొట్టుకుంటూ ఆ రాత్రంతా నిద్రలేక చావాలి? పేదవాడికి ఈ సమస్యలేమైనా ఉన్నయ్యా చెప్పండి? కష్టం చేస్తాడు. కడుపునిండా తింటాడు. మొద్దులా నిద్రపోతాడు. దట్సాల్. పైగా మన ప్రభుత్వం సోషలిజమ్, సోషలిజమ్ అంటూ పేదవాడిని బాగు చెయ్యటానికే చూస్తుందే? కాలేజీల్లో రిజర్వేషన్స్ పేరుతో సీటన్నీ వాళ్ల వేనాయె. మన వాళ్ళకు ఎంత Percentage వచ్చినా సీటు దొరకదు. వాళ్ళచూడు. షెడ్యూల్డ్‌కాస్టు అని ఒక సర్టిఫికేట్ పడేస్తే వాడికి చచ్చినట్టు సీటు దొరుకుతుంది. వోరి బాబాయ్—మనకున్న సమస్యలు వాళ్ళకేం ఉన్నాయి. పైగా మన Personal Problems తోనే చస్తుంటే ఈ అంతర్జాతీయ సమస్యలన్నీ మన బుర్రల్ని వేధిస్తుంటే మనం ఇంట

లెక్చ్వరల్స్‌ము కేవలం కడుపునిండా తిండి తిని పేదవాడిలా అన్నీమరచి పోయి మొద్దునిద్ర పోగలమా!" అన్నాడు ఆనందరావు.

"ఔను. నిద్రపోలేం కాబట్టే ఇలా అర్ధరాత్రి దాటేదాకా ఈ దిక్కుమాలిన క్లబ్‌లో రమ్మీ ఆడుతూ కూర్చుంటున్నాము" అన్నాడు కృష్ణమూర్తి.

"మీరేమన్నా చెప్పండి.... పేదవాడిని గూర్చి మనం బాధపడటం తప్ప వాడికేబాధా లేదు. అయినా ఈ దేశంలో మీలాంటి వాళ్ళు పేద వాడిమీద జాలిపడటం, వాళ్ళను గూర్చి కథలూ, కవిత్వాలు రాయటం ఫాషన్ అయిందిలెండి" అన్నాడు ఆనందరావు.

"అయితే నేనిప్పుడు ఫాషన్‌కోసమే ఇలా మాట్లాడుతున్నా నంటారా" అన్నాడు కృష్ణమూర్తి.

వీళ్ళిద్దరేదో పోట్లాడుకునేట్టున్నారు అనుకున్నాడు నరసింహా రావు.

"యేదో పోనిద్దురూ.... మీరు మాట్లాడటమే తప్ప రమ్మీ ఆడటం లేదు.... కమాన్ కృష్ణమూర్తిగారు.... కార్డు వేయండీ" అన్నాడు నరసింహారావు.

"సారీ నరసింహారావుగారు....నాకు ఆడాలనిపించటంలేదు. కాలప్ చేస్తున్నాను" కృష్ణమూర్తి కార్డ్సు టేబుల్‌మీదపడేసి బయటకెళ్ళి పోయాడు.

"ఏమిటి వీడి పొగరు. నేనంటే యేమనుకుంటున్నాడో త్వరలోనే వీడి పొగరణచకపోతే నా పేరు ఆనందరావుకాదు" అన్నాడు ఆనంద రావు.

ఆనందరావు అలా అన్నాడంటే హెల్త్ మినిష్టర్‌తో చెప్పి కృష్ణ మూర్తిని ఎక్కడో అడివిప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేయిస్తాడని నరసింహా రావుకు తెలుసు. "పాపం కృష్ణమూర్తి మంచివాడే. కాని లౌక్యం తెలియదు" అనుకున్నాడతడు.

"ఏమిటో కొంచెం చిత్రంగానే మాట్లాడుతాడు" అన్నాడు సంతోష్ రెడ్డి.

"ఏమిలేదండీ. వాడో పెద్ద humanitarian అయినట్లు పోజు కొడ్తాడు. మనమేమో దుర్మార్గులమైనట్లు, దానికి కారణమేమిటో తెలుసా? యేడుపు. మనం బాగా సంపాదిస్తున్నాము. ఈ తలతిక్కగాడి దగ్గరకు ఎవడూ వెళ్ళడు. అందుకని ఈ ప్రిన్సిపుల్స్. ఒకటి ఆలోచించండి. వేలకువేలు ఖర్చుపెట్టి ఈ చదువు చదివాం ఎందుకంటారు? యేవో నాల్గు రాళ్ల సంపాదించుకోవాలనేగదా. అందరూ వీడిలాగ పోజుకొడ్తే ఇంట్లో పెళ్ళాలు తిండిపెట్టరు" అన్నాడు ఆనందరావు.

"ఆహా! బాగా చెప్పారుసార్. ఉన్న వాస్తవం అదీ" అన్నాడు నరసింహారావు. పాపం నరసింహారావు ఆ పరిస్థితిని చాలాసార్లు ఎదుర్కొన్నాడు. నరసింహారావు ఎం. బి. బి. యస్ చదవటానికి కారణం అతని భార్యే. నరసింహారావు మామగారు లక్షాధికారి. ఆ మామగారే 'చాకులాంటి కుర్రాడు, చదివిస్తే పైకొచ్చేట్టున్నాడు. మనకు పనికొచ్చేట్టుకూడా ఉన్నాడు' అని చాలాదూరం ఆలోచించి నరశింహారావుమీద వేలకు వేలు పెట్టుబడిపెట్టి చదివించాడు. తర్వాత కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు. తండ్రి పెట్టిన ఆ వేలకు వేల రూపాయల్ని ఇప్పుడు కూతురు వడ్డీతోసహా వసూలుచేస్తోంది. మామూలుగా జీతం పోగా ప్రైవేటుగా చూసే కేసులున్నండి రోజూ యాభై రూపాయలైనా తీసుకురాకపోతే ఆ రోజూ నరసింహారావుకు ఇంట్లో తిండి దొరకటం కష్టమే.

# 3

బయట కారు ఆగిన చప్పుడైంది.

"కలెక్టరొస్తున్నాడు....కలెక్టరొస్తున్నాడు" అన్ని టేబుల్స్‌దగ్గర గుసగుసలు విన్పించాయి. రంగడు బిలియర్డ్స్ రూమ్‌కు పరుగెత్తి అశోక్ రెడ్డితో "కలెక్టరొస్తున్నాడు సార్" అని చెప్పాడు. అశోక్ రెడ్డి వెంటనే బయటకు పరుగెత్తుతూ "మిసెస్ కలెక్టరు కూడా వచ్చిందా అన్నాడు."

"వచ్చే ఉంటుంది సార్" అన్నాడు రంగడు.

అప్పుడే లోపలకొస్తున్న కలెక్టరు పక్కన అతని సతీమణి ప్రసన్నలను అశోక్‌రెడ్డి "గుడ్ ఈవినింగ్ కలెక్టరు సాబ్.... గుడ్ ఈవినింగ్ మిసెస్ కలెక్టర్" అంటూ ఎదుర్కొన్నాడు.

"గుడ్ ఈవినింగ్" అన్నాడు కలెక్టరు గోపాలరావు.

"వెరి గుడ్ ఈవినింగ్" అంది ప్రసన్న.

వీళ్ళను చూసి లోపలున్న చాలామంది లేచి నిల్చుని నమస్కారాలు చేశారు.

రంగడు వి.ఐ.పి. టేబుల్ దగ్గర కుర్చీలు సరిచేశాడు. ముగ్గురూ వెళ్ళి కూర్చున్నారు.

కలెక్టర్ ఫుల్ సూట్‌లో ఉన్నాడు. అతనిది యే ప్రత్యేకతా లేని రూపం. మధ్యవయస్కుడే అయినా వెంట్రుకలన్నీ పోయి యెర్రబడిన అతని బట్టతల అతడు యాభై యేళ్ళ పైబడిన వాడనిపించేలా చేస్తుంది. మనిషి బాగా నలుపు. చిన్న కళ్ళు మనిషి. ఎప్పుడూ చాలా అలసిపోయి నట్లుగా కనిపిస్తారు.

కలెక్టర్ భార్య ప్రసన్నకుమారి గొప్ప అందకత్తె. మేలిమిబంగారు ఛాయతో మెరిసిపోయే ఆమె శరీరం గొప్ప కాంతిలో వెలిగిపోయే ఆమె పెద్దపెద్ద కళ్ళు ఆమెను చూసిన వాడి కళ్ళకు మిరిమిట్లు గొల్పుతాయి. ప్రసన్న బాగా చదువుకుంది కూడా. తను అందగత్తెనని ఆమెకుతెలుసు. తన అందాన్ని ఆకర్షణీయంగా ఉంచుకోవటం కూడా ఆమెకు బాగా తెలుసు.

అశోక్‌రెడ్డి కార్డ్సు ప్రఫుల్ చేయసాగాడు. గొప్ప నేర్పుతోకదులుతున్న అతని వేళ్ళకేసి చూసింది ప్రసన్న. అశోక్‌రెడ్డిలో స్త్రీలను ఆకర్షించే ప్రత్యేకత యేదో ఉంది. ఆ విషయం అతనికి కూడా బాగాతెలుసు. అతను చాలా త్వరగా అంత గొప్పవాడుగా వెలిగిపోవటానికి ఒక ముఖ్యమైన కారణం అతనిలో ఈ ప్రత్యేకతే. ఆ ఊరిలోని ఆఫీసర్స్ భార్యలంతా అతడంటే పడిచస్తారు. అతనికి ఆఫీసర్స్‌తో యే పని కావాలన్నా అతడు వాళ్ళ భార్యలతో చెప్పి చేయించుకుంటాడు.

నిజానికి అశోక్‌రెడ్డి పెద్ద అందగాడేమీకాదు. ఆ మాత్రం అంద చందాలు యౌవనంతోబాటు డబ్బూ, హోదా ఉన్న యే మగవాడికైనా

ఉంటాయి. కాని స్త్రీలను ఆకర్షించాలంటే అందమొక్కటే ప్రధానం కాదని ఇదొక ప్రత్యేకమైన ఆర్ట్ అని దాన్ని ఉపాసించి నేర్చుకోవాలని అశోక్‌రెడ్డికి తెలుసు. అతాడ కళను స్వంతం చేసుకున్నాడు.

అశోక్‌రెడ్డి ముగ్గురికి కార్డ్సు వేశాడు.

"వో....వ్వాట్ అశోక్, ఇంత చెత్త కార్డ్సు వేశావు?" అంది ప్రసన్న బుంగమూతి పెడుతూ.

"రియల్లీ సారీ మేడమ్.... పోనీ మన కార్డ్సు ఎక్స్ఛేంజి చేసుకుందామా?" అన్నాడు అశోక్‌రెడ్డి.

"ఊరికే యేదో నా తృప్తి కోసం అంటారు కాని మీరు అంత శాక్రిఫైస్ చెయ్యగలరా?" అంది ప్రసన్న.

"ఇదో శాక్రిపైసా? కమాన్....మీ కార్డ్సు నా కివ్వండి" అశోక్ తన కార్డ్సు ప్రసన్నవైపు తోశాడు.

"ఆల్‌రైట్" ప్రసన్న తన కార్డ్సు అతని కిచ్చింది.

"ఓ! రియల్లీ వండ్రఫుల్, దేర్ ఆర్ టు జోకర్స్.... మీరు నిజంగా శాక్రిఫైస్ చేశారు." అంది ప్రసన్న.

"ఊరికే మాట లెందుకు. ఆడరాదూ!" అన్నాడు విసుగ్గా కలెక్టర్.

"అబ్బబ్బ....మీరెప్పుడూ విసుక్కోవటమే. ఇంట్లో విసుక్కోవటమే.... క్లబ్బులో విసుక్కోవడమే.... విసుగు మొదలు పుట్టి తర్వాత మీరు పుట్టారు." అంది ప్రసన్న విసుగ్గా. పెదవులదాకా వచ్చిన నవ్వుని బయటపడనీయలేదు అశోక్. తను నవ్వితే కలెక్టర్‌కు కోప మొస్తుందని అతనికి తెలుసు.

వాళ్ళు కాస్సేపు నిశ్శబ్దంగా ఆడారు.

అశోక్‌రెడ్డి 'షో' అంటూ కార్డు కిందేశాడు.

"వో గ్రేషియస్—అంత చెత్త కార్డ్సుతో యెలా రమ్మీ చేశారో అశోక్! యు ఆర్ ది మోస్ట్ బ్రిలియంట్ రమ్మీ ప్లేయర్—యు ఆర్ ఏ జీనియస్ ఐ సే" అంది ప్రసన్న.

"అంతగా పొగడకండి మేడమ్." అన్నాడు అశోక్.

మళ్లీ బయట కారాగిన చప్పుడైంది.

"ఎస్. పి. వస్తున్నాడు" అన్నారంతా. రంగడు బయటకు పరుగెత్తాడు. ఎస్. పి, ఎస్. పి. భార్య లోపల కొచ్చారు. అశోక్‌రెడ్డి లేచి అతని ఎదురుగా వెళ్ళి విష్ చేశాడు. ఎస్. పి. వచ్చి కలెక్టర్‌ను విష్ చేశాడు—ఎస్. పి. భార్య కలెక్టర్ భార్యను విష్ చేసింది. ఎస్. పి. ఆరడుగుల ఎత్తు. అంతకు తగ్గ లావు. తెల్లటి శరీర చ్ఛాయతో వో హాలీవుడ్ యాక్టర్‌లా వున్నాడు. కాని ఎస్. పి. భార్యలో ఏ ఆకర్షణా లేదు. అప్పుడే ఆమె చాలా వయస్సు మళ్ళిన స్త్రీలా కనిపిస్తోంది. ఎస్. పి కంటే వయస్సులో ఆమె చాలా పెద్దదేమోనన్న అభిప్రాయం కూడా వుంది. అలంకరణ కూడా చాలా వోల్డ్ ఫాషన్డ్‌గా ఉంది.

ఐదుగురికి కార్డ్సు వేయసాగాడు అశోక్‌రెడ్డి.

"ఈరోజు ఇంత ఆలస్యం చేశారేమిటి?" అన్నాడు కలెక్టర్.

"ఈ బ్లడీ కమ్మీస్ ఓ పెద్ద ప్రాబ్లమ్ అయ్యారు సార్. ఇందాకే ఓ మెసేజ్ వచ్చింది. ఇక్కడికి ముప్పైమైళ్ళ దూరంలో ఓ భూస్వామి హత్య జరిగింది" అన్నాడు ఎస్. పి.

"నక్సలైట్సేనా? ఎవడన్నా దొరికాడా" అన్నాడు కలెక్టర్.

"ఎవ్వడూ దొరకలే. యాభై వేల విలువచేసే క్యాష్, నగలూ కూడా దోచుకుపోయారట!" అన్నాడు ఎస్. పి.

"ఎందుకూ మీరూ, మీ పోలీసు బలగమూ, బ్రాడ్ డేలైట్‌లో ఇట్లాంటి మర్డర్స్ జరుగుతుంటే, ఇవ్వాళ ముప్పయిమైళ్ళ దూరంలో హత్య జరిగింది. రేపు వాళ్ళు ఈ క్లబ్‌కే వచ్చి మనందర్నీ చంపేసి పోయినా దిక్కులేదు. అట్లా వుంది మీ పరిపాలన" అంది ప్రసన్న.

"మా పరిపాలన యేముంది మేడమ్. సోషలిజమ్, సోషలిజమ్ అంటూ మన ప్రధానమంత్రే ఈ కమ్మీస్‌పట్ల చాలా సాఫ్ట్‌గా ఉంటున్నది. టూ సాఫ్ట్. అందుకే వాళ్లు అలా మితిమీరిపోతున్నారు. గవర్నమెంట్ మాకు ఫుల్‌పవర్స్ యివ్వమనండి. నాల్గురోజుల్లో ఈ డిస్ట్రిక్టునంతా ఊడ్చిపారేస్తాను. కమ్మీ అనేవాడు మచ్చుకైనా దొరకకుండా చేస్తాను. కాని యేదీ. దిస్ గవర్నమెంటీజ్ టూ సాఫ్ట్. ఐసే" అన్నాడు ఎస్.పి.

"అసలు ఈ దేశంలో డెమోక్రసి, సోషలిజమ్ అంటూ మన ప్రభుత్వం స్లోగన్స్ వల్లిస్తున్నంతకాలం మనమేమీ చెయ్యలేం. ఐ డోంట్ నో వై దట్ జనరల్ మానెక్‌షా ఆర్ సమ్ అదర్ జనరల్ ఈజ్ నాట్ టేకింగ్ పవర్ ఇంటూ హిజ్ హాండ్స్. ఇట్లాంటి దేదో జరిగితే తప్ప ఈ దేశం బాగుపడదు. ఇండోనీషియాలో జనరల్ సుహార్తో ఏం చేశాడు. వన్‌మన్త్‌లో అక్కడున్న కమ్మీన్ నందర్నీ ఊచ కోతకోసి పారేశాడు. అట్లా తప్ప ఈ కమ్మీన్‌ను ఇంకోలా ఎదుర్కోలేం. I wish there is atleast one general Suharto in this Country. లేకపోతే త్వరలోనే ఈ దేశం కూడా మరో వియత్నామ్ అయిపోతుంది" అన్నాడు కలెక్టర్ సతీమణికేసి ఈసారి బాగా మాట్లాడాను కదూ అన్నట్టుగా చూస్తూ.

"Yes sir! I dont't know why our Mrs. Gandhi is not realising this" అన్నాడు ఎస్.పి. ప్రసన్నకేసి తిరిగి.

"ఔను——మీకు చేతగాక ఆమెనంటారు. కొమ్ములు తిరిగిన మొగ మహారాజులుం ఉండగా ఓ ఆడది ప్రైమ్ మినిస్టర్ అవుతుందా అని మీ యేడుపు" అంది ప్రసన్న.

ఎస్. పి. మొహం చిన్నబుచ్చుకున్నాడు.

"ఛీ! దర్టీకార్డ్స్. నేను డ్రాప్ చేస్తున్నాను." ప్రసన్న విసుగ్గా కార్డ్స్ టేబుల్‌కేసి కొట్టింది. 'యేదండి–మీ కార్డ్స్ ఇటివ్వండి' అంటూ కలెక్టర్ చేతిలోని కార్డ్స్ తన చేతిలోకి లాక్కుంది. అతడు అయిష్టంగా కార్డ్స్ ఆమె చేతికిచ్చాడు. రోజురోజుకు ప్రసన్న మితిమీరి పోతోందనుకున్నా డతను. తన నెవరైనా చూశారేమోనని క్లబ్బంతా ఓసారి కలయజూశాడు.

"వో గ్రేషియస్! ఇంత మంచి కార్డ్స్ దగ్గరుంచుకొని ఇంతసేపు ఆడుతున్నారా? నేను చూడండి——ఈ రౌండ్‌లో రమ్మీ చేసేస్తాను" అంది ప్రసన్న ఉత్సాహంగా.

"మీరు రమ్మీ చేయటమే–అశోక్ వున్నాడు" అంది ఎస్. పి. భార్య ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఏం, అశోక్ ఏమన్నా ఆకాశంలోంచి ఊడిపడ్డాడా!" అంది ప్రసన్న.

"యస్ మేడమ్! ఆకాశంలోంచి ఊడిపడలేదు కాని రమ్మీ మాత్రం చేసేశాను" అంటూ అశోక్ కార్డ్సు క్రిందేశాడు.

"Oh! you are too brilliant a player I say. మావారూ వున్నారు ఎందుకు, దండగ. ఇంతసేపు ఇంత మంచి కార్డ్సు వుంచుకొని మొదలకుండా కూర్చున్నారు. చూడండి టు జోకర్స్ ఒక సీక్వెన్స్—కార్డ్సు టేబుమీదకు విసుగ్గా విసిరేసింది ప్రసన్న.

కలెక్టరుకు నిప్పులమీద కూర్చున్నట్టుగా వుంది.

V.I.P. టేబుల్ దగ్గరకు రంగడు పరుగెత్తుకొని వచ్చాడు. ఎస్.పి.తో "మీకు ఫోనొచ్చింది సార్" అన్నాడు.

"ఎక్కణ్ణించట?" అన్నాడు ఎస్.పి.

"జైలునుంచి సార్" అన్నాడు రంగడు.

"జైలునుంచా? అయితే ఏదో కొంపమునిగే వుంటుంది" ఎస్. పి. వెంటనే లేచి ఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

"జైలునుంచి ఇంతరాత్రి ఫోనేమిటండి. నాకేదో భయంగా వుంది" అంది ఎస్.పి భార్య.

"ఎస్.పి గారి శ్రీమతి మీరే భయపడితే మేమంతా ఏమైపోవాలి?" అన్నాడు అశోక్.

"మీవార్ని హెడ్‌క్వార్టర్స్‌లో వున్న రిజర్వు పోలీసునంతటిని మీ ఇంటిముందు కాపలా వుంచమనండి. అప్పుడుగాని మీకు హాయిగా నిద్రపట్టదు" అంది ప్రసన్న.

"ఇంతకు ఏం జరిగి వుంటుందంటారు?" అంది ఎస్.పి. భార్య.

"మొన్ననే కొన్ని అడవి ప్రాంతాల్ని గాలించి పదిమంది నక్సలైట్లని పట్టుకొన్నారు. వాళ్లు జైలునుండి తప్పించుకొని పారిపోయి వుంటారు. ఇలా వుంది మన ఆడ్మినిస్ట్రేషను. కొద్దిరోజుల్లోనే ఈ దేశం యేమైపోతుందో తల్చుకుంటే భయమేస్తోంది" అన్నాడు కలెక్టర్.

"అమ్మబాబోయ్—వాళ్లు పారిపోయారా?"

"వాళ్ళకు మా వారిమీద రోషంగా ఉందిట—వాళ్ళు మా ఇంటికే వస్తారు. ఎలా?" ఎస్.పి. భార్య వణికిపో సాగింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

అశోక్, ప్రసన్న ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకొని ముసి ముసిగా నవ్వుకున్నారు.

"వచ్చినా రావొచ్చు—పరిస్థితుల లాగే ఉన్నాయి" అన్నాడు కలెక్టర్.

"మీ వాలకం మరీ బావుందండి. ఆమె ఇదివరకే వణికిపోతుంటే మీరామెను ఇంకా హడలగొట్టేయండి, భలే జిల్లా కలెక్టర్ దొరికాడురా బాబు! ఇదిగో తోక అంటే అదిగో పులి అనే రకం" అంది ప్రసన్న.

ఈమె నోటిదురుసును ఎలా పోగొట్టాలా? అన్న ఆలోచనలో పడిపోయాడు కలెక్టర్.

ఎస్. పి. హడావుడిగా వచ్చాడు. అప్పుడే అతనికి మొఖమంతా చెమటపట్టి ఉంది. దస్తీతో తుడుచుకుంటూ.

"అనుకున్నదంతా అయ్యింది సార్. మొన్న అష్టకష్టాలు పడి ఇద్దరు రిజర్వ్ పోలీసుల్ని కోల్పోయి అరెస్టుచేసి పట్టుకొచ్చామే ఆ పది మంది జైలు నుండి పారిపోయారట దిసీజ్ రియల్లీ టూ మచ్—నేను జైలుదాకా వెళ్లొస్తాను" అన్నాడు ఎస్. పి.

"యస్. దట్స్ వాట్ ఐ వాజ్ ఎక్స్‌పెక్టింగ్. ఎట్లా పారిపోయుంటారంటారు" అన్నాడు కలెక్టర్.

"ప్యూన్స్‌లో ఎవరో హెల్ప్‌చేసి ఉంటారు. వాళ్ళంతా ఒకటే జాతి కదా! నేను వెళ్ళి తెలుసుకుంటాను" అన్నాడు ఎస్.పి. భార్య కేసి తిరిగి, "రుక్మిణీ! ఇంట్లో నిన్ను డ్రాప్‌చేసి వెళ్తాను పదా" అన్నాడు. రుక్మిణి లేచి అతన్ని అనుసరించింది.

"మీ రుక్మిణి చాలా భయపడ్తోందండి కొంచెం ధైర్యం చెప్పండి" అంది ప్రసన్న.

"ఔనండి. రుక్మిణి వట్టి పిరికి సన్నాసండి" అన్నాడు ఎస్.పి.

ఎస్.పి; ఎస్.పి. భార్య వెళ్ళిపోయారు.

జైలునుండి నక్సలైట్స్ పారిపోయారన్న వార్త క్లబ్బంతా వ్యాపించింది.

"ఈ పోలీసువాళ్ళకు జీతాలు దండగ" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"మిలిటరీ గవర్నమెంట్ తప్ప ఈ పోలీసులతో లాభంలేదు" అన్నాడు డాక్టర్ ఆనందరావు. "ఎస్.పి.లు, కలెక్టర్లు అర్ధరాత్రి దాకా క్లబ్‌లో పేకాడుతూ కూర్చుంటే వీళ్ల లా అండ్ ఆర్డర్ యేం కాపాడ తారు?" అన్నాడు తను నైట్ డ్యూటీ వదిలేసి వచ్చానన్న సంగతి కాస్సేపు మరచిపోయిన ఆనందరావు.

గడియారం పదకొండుగంటలు కొట్టింది.

పేకాట మంచి రంజుగా సాగుతోంది.

కలెక్టర్‌గార్కి పేకాటమీదికి మనస్సు పోవటంలేదు. అప్పటికే ప్రసన్న ఐదుసార్లు అతని చేతుల్లోంచి కార్డ్సు లాక్కుంది.

"ఈసారి నేను రమ్మీ చేస్తాను చూడండి. ఈసారి రమ్మీ చెయ్యక పోతే నేనిక రమ్మీఆడటం మానేస్తా!" అంది ప్రసన్న.

"వెరీగుడ్. ఈసారి మీరు రమ్మీ చేస్తే నేను డబుల్ కౌంటిస్తాను. కమాన్" అన్నాడు అశోక్.

"మాట అనగానే కాదు. నిలుపుకోవాలి మిష్టర్ అశోక్!" అంది ప్రసన్న.

"ఆఫ్టరాల్ రెండువందల రూపాయలకోసం మాటనిలుపుకోకపోవ టమా—అశోక్.

కలెక్టర్ ప్రసన్నకార్డ్సు కేసి చూస్తూ ఆమెకు సలహాలివ్వ బోయాడు. "నోనో....ఆ కార్డు దిగొద్దు. ఇది ఈ కార్డు...."

"ఆ! ఇక మీరు సలహాలిస్తే నేనీజన్మలో రమ్మీ చెయ్యలేను." విసుగ్గా అంది ప్రసన్న.

కలెక్టర్ చాలా చిన్నబుచ్చుకున్నాడు.

"షో!" అంటూ కార్డ్సు కిందపడేసి చప్పట్లు కొట్టసాగింది ప్రసన్న. "ఇట్‌లాస్ట్ నేను వెళ్తాను Ashok is not unbeatable." చంటి పిల్లలా పొంగిపోతూ చప్పట్లు కొట్టసాగింది ప్రసన్న. క్లబ్‌లో వున్న అందరూ ఆమెకేసి చూశారు.

"హార్టీ కంగ్రాచ్యులేషన్స్. ఇదుగోండి మీ రెండువందలు."

అశోక్ రెండువందల రూపాయల నోట్లను ఆమెవైపు తోశాడు. వాటిని చేతిలోకి తీసుకున్న ప్రసన్న మొఖం మొదటిసారిగా వందరూపాయల నోటు చూసినట్టుగా వికసించింది. భర్తకేసి తిరిగి "చూశారా? నేనెంత డబ్బు సంపాదించానో పేకాటలో మీరింత డబ్బు ఎప్పుడైనా సంపాదించారా?" అంది.

"సరేగాని చాలా పొద్దుపోయింది. ఇక వెళ్ళిపోదాం పద" అన్నాడు కలెక్టర్.

ఇప్పుడే లెవెన్ దాటింది. అప్పుడే పొద్దుపోయిందా? ఇప్పట్నించే వెళ్ళి యేంచేస్తాం? కావాలంటే మీరు వెళ్ళండి. నేను కాస్సేపాగి వస్తాను? ఇవ్వాళ నేను గెలుస్తున్నాను. నేను పోగొట్టుకున్నదంతా తిరిగి సంపాదించాలి." అంది ప్రసన్న.

"నే వెళ్ళిపోతున్నాను!" కలెక్టర్ విసురుగా లేచాడు.

"వెళ్ళాక కారు పంపండి" అంది ప్రసన్న.

కలెక్టర్ బయటకు వెళ్ళిపోయాడు. "వట్టి ప్రిమిటివ్ మాన్. నా ఖర్మకొద్దీ దొరికాడు. ఆతనితో వేగలేక ఛస్తున్నాను" అంది ప్రసన్న.

అశోక్ మాట్లాడకుంటా కార్డ్సు వేయసాగాడు.

"కొంచెం స్కాచ్ రుచి చూస్తారా" కార్డ్సు చేతిలోకి తీసుకుంటూ అడిగాడు అశోక్.

"అడిగి టైమ్ వేస్టు చెయ్యకపోతే తెప్పించరాదూ"

"రంగడూ" హుంషారుగా పిల్చాడు అశోక్.

రంగడు రెక్కలు కట్టుకుని వచ్చి అతని పక్కనవాలాడు.

"బార్‌కెళ్ళి ఓ స్కాచ్ పట్రా-ఈ చిట్టీ చూపించు"

పెన్‌తో ఓ కాగితంమీద ఏదోరాసి రంగడి చేతిలో పెట్టాడు. రంగడు బయటకు పరుగెత్తాడు.

"కమాన్! ఆడండి"—ప్రసన్న.

"ఆటమీదకు మనసు పోవటంలేదు ప్రసన్నా"—అశోక్.

"దేనిమీదకు పోతోందిట!"

"నిజం చెప్పమంటారా?"

"అబద్ధం చెప్పండి" ఆమె అందంగా నవ్వింది.

"ఉహూ! నిజమే చెప్తాను మీరేమీ అనుకోనంటే."

"నిజం చెప్పేవాడికి ఎవరో ఏదో అనుకుంటారన్న భయం ఉండకూడదు. ఫరవాలేదు, చెప్పండి."

"మీ అందంమీదికి పోతోంది."

"వో రియల్లీ" ఆమె కళ్లు పెద్దవిచేసింది.

"అబ్బ! మీ కళ్ళల్లోని అందాన్ని భరించలేను. నిజం ప్రసన్నా! ఇవ్వాళ మీరు మోస్ట్ బ్యూటీఫుల్‌గా కనిపిస్తున్నారు. నా కళ్ళను మీమీది నుండి మళ్లించుకోలేక పోతున్నాను."

"ఇదేమిటి! ఇవ్వాళ కంట్రాక్టర్‌గారికి కవిత్వం వస్తోంది. కంట్రాక్టరూ, కవిత్వమూ రెండూ ఒకచోట ఉండటానికి వీల్లేదే!"

"నిజం ప్రసన్నా. నిన్ను చూసిన వాడికెవడికైనా కవిత్వం వస్తుంది మీలో ఆ శక్తి...."

"అంటే నన్ను చూసినవాడల్లా కవైపోతాడన్నమాట. అయితే తెలుగు కవిత్వానికేదో మూడిందన్నమాట. అయినా ఇంతసేపు మా కలెక్టర్‌గారున్నపుడు ఎక్కడికి పోయిందో ఈ కవిత్వం"

"ప్లీజ్ ప్రసన్నా! నువ్వలా మాట్లాడితే నేను బ్రతకలేను."

"నిజంగా! అయితే ఇక మాట్లాడను."

రంగడు విస్కీ బాటిల్, గ్లాసులు, సోడాలు తెచ్చాడు. రెండు గ్లాసుల్లో పోశాడు. ఓగ్లాసు ప్రసన్నకిస్తూ "కమాన్ ప్రసన్నా టు ది హెల్త్ ఆఫ్ గోపాలరావు ది గ్రేట్" అన్నాడు అశోక్.

"వై నాట్ టు ది హెల్త్ ఆఫ్ అశోక్ ది గ్రేట్" అంది ప్రసన్న.

ఇద్దరూ నవ్వుకుంటూ విస్కీ సిప్ చెయ్యసాగారు.

# 4

"లక్కీ ఫెలో అంటే ఆ అశోగ్గాడే! కలెక్టర్ పెళ్ళాన్నే బుట్టలో వేశాడు"అన్నాడు రంగనాథరావు. రంగనాథరావు ఈ రోజు చాలా

ఉత్సాహంగా వున్నాడు. ఆ ఉత్సాహానికి కారణం అతడు చాలా గెయిన్‌లో వుండటమే. ప్రతాపరెడ్డికి మాత్రం ఆరోజు చాలా చిరాగ్గా వుంది. ఎన్నడూ లేంది అతడీ రోజు లాస్‌లో వున్నాడు.

"మీరూ ట్రై చెయ్యకపోయారా? మీ బుట్టలో పడేదేమో" అన్నాడు ప్రతాపరెడ్డి.

మనలాంటి వాళ్లు ట్రైచేస్తే అది చెప్పొచ్చుకు తంతుంది"— రంగనాథరావు.

"అటు లోయర్ క్లాసెస్‌లోను, ఇటు హైయర్ క్లాసెస్‌లోను వ్యభిచారం చాలా ఫ్రీగా సాగుతోంది. ఎటొచ్చీ మనలాంటి మిడిల్ క్లాసెస్‌లోనే Moral values ఏవన్నా ఉన్నాయంటే"—సాంబయ్య.

"ఔను, మన పెళ్ళాలందరూ పతివ్రతలే. మనమంతా ఏకపత్నీ వ్రతులమే. అవకాశం లేనంతకాలం అందరూ పతివ్రతలే. అందరూ ఏకపత్నీ వ్రతులే!"—మోహనరావు "అవకాశం అంటే"- సాంబయ్య.

"అవకాశం వచ్చినప్పుడు మీకే తెలుస్తుంది లెండి—" మోహనరావు. ప్రతాపరెడ్డి, రంగనాథరావు నవ్వారు.

నర్సయ్య ఇంకా వాళ్ళ టేబుల్ దగ్గరే కూర్చున్నాడు. కాని అతను ఆడటంలేదు. అతని దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. వాళ్ళను యాభై రూపాయలు అప్పివ్వమని అడిగాడు. "పేకాట దగ్గర అప్పడిగితే జైల్లో వేస్తారు" అన్నాడు ప్రతాపరెడ్డి.

ఇంటికి ఏ ముఖం పెట్టుకుని వెళ్ళను? అన్న సందేహం కల్గింది నర్సయ్యకు. ఈ రోజు జీతం తీసుకోగానే ఇంటికే వస్తానని భార్యతో ప్రమాణం చేశాడు. ఇంటివాడికి నాలుగునెల్ల అద్దె ఇవ్వాలి. ఈ రోజు ఇవ్వకపోతే ఇంట్లోంచి గెంటేస్తానన్నాడు. తను ఐదారుగంటల క్రితమే తీసుకున్న 150 రూపాయల జీతం అయిపోయింది.

నర్సయ్య కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

నర్సయ్య క్లబ్‌కు వెర్రిగా రావటానికి ఒక కారణం ఉంది. అతడా క్లబ్‌లో చాలా డబ్బు పోగొట్టుకున్నాడు. తెలివిగా ఆడి తిరిగి ఆ డబ్బంతా రాబట్టుకున్నాక ఇక క్లబ్‌కు రావడం మానుకోవాలని నిర్ణయించుకున్నాడు. అందుకని ఎప్పుడు చేతిలో నాలుగుడబ్బులు కనిపిస్తే

అప్పుడే క్లబ్‌కు పరుగెత్తుతాడు. తను పోగొట్టుకున్న డబ్బును ఈ డబ్బుతో తిరిగి సంపాదిస్తానని ఇలా అతడు డబ్బు పోగొట్టుకుంటున్న కొద్దీ క్లబ్‌కు వెళ్ళాలనే కోరిక అతనిలో అధికం కాసాగింది.

గేటుదగ్గర యేదో కలకలం వినిపించింది.

"ఏయ్.... ఎవరుకావాలి.... ఎవరునువ్వు........లోపలకు రావద్దు అంటుంటే వస్తావేం ? నీకేనమ్మా చెప్పేది...." అన్న రంగడి కేకలు వినిపిస్తున్నాయి.

అంతా అటు తిరిగి చూశారు.

నర్సయ్య ప్రాణాలు పోయాయి. ఆమె రంగడి మాటలు లెక్క-పెట్టకుండా లోపలకు వస్తున్న ఆ స్త్రీ నర్సయ్య భార్య పార్వతి. వెంటనే ఉరేసుకొని చచ్చిపోతే బావుండును అనిపించింది నర్సయ్యకు.

క్లబ్ గేటుదాటి హాల్లోకి వచ్చింది పార్వతి.

ఆమె చేతిలో ఓ పసిపాప, ఆమె యిరుపక్కలా ఓ ఐదేళ్ళ కుర్రాడు ఓ యేడెనిమిదేళ్ళ అమ్మాయి ఉన్నారు. ఆమె వయస్సు ఏమంత ఎక్కువ కాకపోయినా ఆమె కళ్ళల్లో ఓ వంద సంవత్సరాలు నిండిన స్త్రీలో కనిపించే ఒక విపరీతమైన అలసట కనిపిస్తోంది. అక్క-డక్కడ తెల్లవెంట్రుకలతో చిందరవందరగా ఉన్న తల. కన్నీళ్ళతో అట్టలుగట్టిన ముఖం. అక్కడక్కడ చిరిగిపోయిన ఆమె చీర మూర్తీభ వించిన శోకంలా నిల్చుంది పార్వతి వాళ్ళముందు; క్లబ్‌లోని వాళ్ళంతా క్షణంసేపు పార్వతిని చూసి స్తంభించిపోయారు. తర్వాత తేరుకుని.

"ఎవరు ? ఎందుకొచ్చింది." అన్నారంతా.

"I think she is a begger? ఈ పీడ ఇక్కడకూడా దాపు రించిందా ? అరె రంగా? నీకు బుద్ధిలేదుగా, బిచ్చమెత్తుకునే ఈ ముండల్ని క్లబ్బులోనికి రానిస్తావా ? ఇక్కడెవరున్నారో తెలియదూ?" అరిచాడు అశోక్‌రెడ్డి.

"ఇక్కడ మనుషులే వుంటారని శాచ్చానుసార్. కోప్పడకండి. నేను మీరనుకుంటున్నట్టు బిచ్చపుముండను కాను. నేను నా పిల్లలు ప్రతి రోజూ మీతోపాటు పేకాడుతుండే నా భర్తను వెతుక్కుంటూ వచ్చాము" అంది పార్వతి.

అంతా ఒక్కసారి "హా! హా!" అంటూ మూర్ఛబోయినంత పని చేశారు. "ఎవరు? ఎవరీమె భర్త? "నువ్వా? నువ్వా?" అన్నట్టుగా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

నర్సయ్యకు తనను వాళ్ళంతా అంతమందిలోను నగ్నంగా నిల్చోబెట్టి కొరడాతో కొడ్తున్నట్టుగా అనిపించింది.

"ఎవరు నీ భర్త?" అసహ్యం ధ్వనిస్తున్న కంఠంతో అడిగాడు అశోక్. కళ్ళు పెద్దవి చేసి 'నువ్వుకూడా ఆడదానివేనా!' అన్నట్టుగా చూసింది ప్రసన్న పార్వతికేసి.

"అదిగో....ఆయనే....నేను ఇలా తెగించానని మీరంతా అనుకుంటున్నారు....ఇది ఆడదేనా అని కూడా మీకు సందేహం కల్గుతున్నది. కాని నా కింత కంటే గత్యంతరం లేకపోయింది....నేనూ మర్యాదస్తుల కుటుంబంలో పుట్టినదాన్నే. గుట్టుగా కాపురం చేసుకుందామనుకున్న దాన్నే. కాని నా భర్త నా కా అవకాశం కల్పించలేదు. చివరకివ్వాళ అర్ధరాత్రి ఈ క్లబ్బుకు రపించాడాయన— ఈ క్లబ్బులు పెట్టారు బాగానే ఉంది. బాగా డబ్బున్న లక్షాధికారులకే ఈ క్లబ్బుకొచ్చే అర్హతవుంటుందని నిర్ణయిస్తే బావుండేది మాలాంటి దౌర్భాగ్యులకు ఈక్లబ్బుల్లో స్థానంలేదు. నా భర్త అయిదారేళ్ళగా ఈ క్లబ్బు కొస్తున్నాడు. జీతం రాగానే ఆ జీతం అయిపోయేదాకా క్లబ్‌లో గడిపి వట్టి చేతులతో ఇంటికొస్తాడు. నేనూ, నా పిల్లలూ ఆనెలంతా పస్తులుంటూ....ఇంట్లో వున్న చెంబూ, బిందె అమ్ముకుంటూ గడపాలి. ఆయన తల్లిదండ్రులు సంపాదించి పోయిన ఆస్తిపాస్తులన్నీ అమ్మేశాడు. నాకున్ననగలన్నీ అమ్మేశాడు. నేను ఎంతయేడ్చిమొత్తుకున్నా అతడుక్లబ్బుకు రావటం మానలేదు. నాలుగునెలలుగా ఇంటి అద్దె కట్టలేదు. పస్తులుంటూనో, పడిగాపులు పడుతూనో నెత్తిమీదింత నీడనిస్తున్న ఆ ఇంట్లో బతుకుతున్నాము. జవ్వాళ జీతం తీసుకోగానే కనీసం రెండునెల్ల అద్దెనాన్న యిచ్చేస్తామన్న షరతు మీద ఇంటి యజమాని యింట్లో ఉండనిచ్చాడు. మా వారు ఇవ్వాళ జీతం తీసుకోగానే ఇంటికొస్తానని నా పిల్లల నెత్తిమీద చెయ్యిపెట్టి ప్రమాణం చేశారు. కాని డబ్బు చేతుల్లో పడగానే ఆయన కాళ్ళు క్లబ్బుకే దారితీస్తాయి. ఆయన కోసం పదింటిదాకా ఎదురుచూస్తూనే ఉన్నాను. అప్పటికే ఇంటి

యజమాని పదిసార్లు అద్దె కోసం తిరిగిపోయాడు. పాపం ఆ ఇంటా యన మాత్రం యేంచేస్తాడు. అతని ఓపిక నశించిపోయింది. తక్షణమే ఇంట్లోంచి బయటకునడవమని నన్నుబయటకు గెంటేశాడు. బూతులుతిడ్తూ ఇంటికి తాళంవేసుకొని వెళ్ళిపోయాడు. ఎవరింటికైనావెళ్ళి ఆశ్రయం అడిగి యే బావిలోనన్నాపడి చద్దామనుకున్నాను. కాని చచ్చేముందు ఈ పిల్లల్ని ఆయన పాదాల మీదపడేసి పోదామని ఇలా వచ్చాను చెప్పండి. ఇంతకంటె నన్నేం చెయ్యమంటారో చెప్పండి....'ఉవ్వెత్తున పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆమె ఆపుకోలేకపోయింది. కుళ్ళి కుళ్ళి యేడుస్తూ కుప్పలా కూలిపోయింది పార్వతి. ఆమె పిల్లలుకూడా ఆమె మీద పడి యేడ్వసాగారు.

క్షణంసేపు క్లబ్‌లోవున్న వాళ్ళందరిలో హృదయాలు ద్రవిం చాయి. తను ఇంకా జీవించే ఉన్నాడా! అన్న సందేహం కల్గింది నరసయ్యకు.

"వో గ్రేషియస్....పి. టీ....పి. టీ.... మోస్టు పిటియబుల్ పూర్‌వుమన్ " వింత ధ్వనులు చేసింది ప్రసన్న.

అందరూ కార్డ్సు టేబుల్‌మీద పడేశారు. ఎవరి నోటా మాట రాలేదు. అంతా కుర్చీలకు అతుక్కుపోయినట్టు కూర్చున్నారు.

"Who is that fellow ఎవరు ఈమె భర్త?" అశోక్‌రెడ్డి కంఠం ఖంగున మోగింది.

"ఇదిగో ఈయనే ఉన్నట్టున్నాడు." నర్సయ్యను అందరికీ చూపెట్టాడు ప్రతాపరెడ్డి.

"ఇట్లాంటివాణ్ణి ఈ క్లబ్‌కు ఎందుకు ఎలౌవ్ చేస్తున్నారు. సెక్రటరీ ఎక్కడ?"

"వారు ఇవ్వాళ రాలేదు సార్" అన్నాడు రంగడు.

"యేమయ్యా....బుద్ధిలేదూ! పెళ్ళాంపిల్లల్ని యేడిపిస్తూ క్లబ్‌లో కొచ్చి పేకాడతారా? మా క్లబ్ పరువు తీసేసావు....ఫో....గెటవుట్" గర్జించాడు అశోక్‌రెడ్డి.

నిద్రలోంచి లేచినట్టుగా లేచాడు మోహన్‌రావు.

"ఎక్కడికి పొమ్మంటారు సార్....ఇంట్లోంచి ఇంటాయన గెంటే శాడని ఆమె చెబుతోందిగా" అన్నాడు.

"లెట్ దెమ్ గో టు హెల్. ఐ యామ్ నాట్ కన్సర్న్డ్. బట్ దీస్ బెగ్గర్స్ మస్ట్ లీవ్ దిస్ క్లబ్ యిమ్మీడియట్లీ....డర్టీ ఫెల్లోస్! ఈ క్లబ్ పేరు ప్రతిష్టలన్నీ నాశనం చేశారు. ఇల్లాంటి సీన్స్ ఇంకో రెండు జరిగాయంటే ఈ క్లబ్‌కు మర్యాదస్తు లెవరూ రారు.... యేం నరసయ్యా! అలా దిక్కులు చూస్తావేం? వెళ్ళు.... మళ్ళీ ఈ క్లబ్ కొచ్చావో జాగ్రత్త!" అన్నాడు అశోక్‌రెడ్డి.

"పాపం అతడు మన క్లబ్‌మీద బోలెడు ఆస్తి శగరేనాప దా ఈ ఒక్క రాత్రికి మన క్లబ్ రెస్టురూమ్ వాళ్ళకివ్వకూడదూ?" అన్నాడు మోహనరావు.

"వాట్....వాట్ డూ యూ మీన్ మిస్టర్ మోహన్‌రావ్, ఈ బెగ్గర్స్‌కు గెస్టురూమా? మీకు మతిపోయిందా?" అన్నాడు అశోక్‌రెడ్డి.

"నిజమే! ఇంత జరిగాక నా మతి పోకపోవటం ఆశ్చర్యమే. కాని ఒక మాటమాత్రం నిజం. ఎప్పుడో అప్పుడు ఇక్కడ కూర్చున్న మర్యాదస్తులలో కనీసం సగంమంది పెళ్లాలైనా ఇక్కడకొచ్చి ఇలాగే యేడ్వాల్సిన పరిస్థితి వస్తుంది" అన్నాడు మోహనరావు.

"యే మ్యాన్! యూ ఆర్ టాకింగ్ రాట్" అశోక్‌రెడ్డి.

"యేమన్నారు? యే మ్యాన్ అనా? ఎవడు మ్యాన్! మీరా? నేనా! ఇక్కడ మ్యాన్ అనేవాడు నాకెవడూ కనిపించటంలేదు. ఇక్కడంతా మీలాంటి గొప్పవాళ్ళు. మర్యాదస్తులేగాని "మ్యాన్" ఎవడూ ఉండటానికి వీల్లేదే? నర్సయ్యగారూ! పదండి ఇవ్వాల్టికి మా ఇంట్లో ఉందురుగాని పదండి. ఎందుకలా బిగుసుకు పోతున్నారు. పదండి ఈ క్లబ్‌లో మీరు పోగొట్టుకున్న డబ్బును వచ్చే జన్మలో గెలుచుకుందురుగాని. ప్రస్తుతానికి ఆ ప్రయత్నం మానుకుంటే ఆ చంటి పిల్లలైనా బతుకుతారు. లేవండి" అన్నాడు మోహనరావు.

నరసయ్య పిచ్చిచూపులు చూస్తూ బయటకు నడిచాడు. యేడుస్తూ కూర్చున్న పార్వతి దగ్గరకొచ్చి "లేవండి....ఇక్కడ మీరు ఎంత యేడ్చినా లాభంలేదు. ఇక్కడ మీరు మనుష్యులే ఉంటారని వచ్చారు.

కాని ఇక్కడుండేది అదిగో ఆ పెద్దమనిషన్నట్టు గొప్పవాళ్లు. గొప్ప వాళ్ళు మనుష్యజాతికి చెందరని మీ కింకా తెలియదేమో. పదండి. బయట కెడదాం పదండి. పాపా ! పద. బయటికి వెడదాం పద."

మోహనరావు అమ్మాయి చేయిపట్టుకుని బయటకు నడిచాడు, పార్వతి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అతన్ని అనుసరించింది.

"ఎవడీ తలబిరుసుగాడు. ఈ క్లబ్‌కు వీణ్నెందుకు రానిస్తున్నారు !" అశోక్‌రెడ్డి అరిచాడు.

"ఆయన మా కొలీగ్ సార్" అన్నాడు ప్రతాపరెడ్డి.

"అలాగా! రేపు డైరెక్టర్‌కు ఫోనుచేసి వీణ్ణి వెంటనే ఇక్కణ్ణించి ట్రాన్స్‌ఫర్ చేయిస్తానుండండి?" అన్నాడు అశోక్‌రెడ్డి.

అకస్మాత్తుగా ప్రసన్నకు చాలాకోపం వచ్చేసింది. "మిష్టర్ అశోక్ .... యూ ఆర్ గోయింగ్ టూ ఫార్. నీలో కొంచెంకూడా జాలి లేనట్లుంది. But I was moved to tears పాపం అతనిమీదఎందుకు విరుచుకుపడ్తున్నారు–He seems to be a nice man మనం ఎవరమూ చెయ్యలేని మంచిపని అతడు చేశాడనా అతన్ని ట్రాన్స్‌ఫర్ చేయిస్తానంటున్నారు.... టూ మచ్ .... ఏమిటో .... నా మనసంతా చెడిపోయింది.... నేనుకూడా వెళ్ళిపోతున్నాను."

ప్రసన్న విసురుగా లేచింది.

"ఉండండి.... నేను నా కార్లో డ్రాప్‌చేస్తాను" అన్నాడు అశోక్.

"అక్కర్లేదు, మా కారు వచ్చేసి ఉంటుంది లెండి."

ప్రసన్న క్షణంలో బయటకు నడిచింది.

బయట కారు స్టార్టయిన చప్పుడైంది.

పిడికిళ్లు బిగించి పళ్లు కొరికాడు అశోక్‌రెడ్డి.

ఛీ! తన ప్లానంతా పాడైపోయింది.

ఇవ్వాళ ప్రసన్నను బాగా తాగించి తన మేడకు తీసుకెళ్ళి .... టేబుల్‌మీదున్న విస్కీగ్లాసును నేలకేసి కొట్టాడు. థర్టీ ఫెలోస్. ఈ లోకంలో నర్సయ్యలు, వాడి పెళ్ళాలు, ఆ తలబిరుసు లెక్చరర్ గాళ్ళు లేకుండా నలిపి నుసిచేసి వెయ్యాలన్నంత కసి పుట్టిందతనికి. పగిలిపోయిన గాజుముక్కల్ని యేరుతున్న రంగడ్ని బూటుకాలితో తన్నాడు.

"డర్టీ స్కౌండ్రల్ ...దాన్నెందుకురా లోపలకు రానిచ్చావు....నా కళ్ళ ముందు కనిపించకు ఫో....పాపమని ఉద్యోగం ఇప్పిస్తే....రేపు సెక్రటరీతో చెప్పి డిస్మిస్ చేయిస్తానుండు" రంగడికి అశోక్ రెడ్డి కళ్లు కళ్ళలా కనిపించలేదు. చింతనిప్పుల్లా కనిపించాయి. బాధతో విలవిల్లాడిపోతూ కడుపు పట్టుకొని లేచి నిల్చున్నాడు రంగడు. గొంతుదాకా వచ్చిన దుఃఖాన్ని మింగేశాడు. అంతకన్నా చేసేదేమీలేదని వాడికి తెలుసు.

# 5

ఓ పది నిముషాలపాటు ఆగిపోయిన పేకాట మళ్ళీ సాగింది. గడియారం ఒంటిగంట కొట్టింది.

"మోహనరావు నిజంగా చిత్రమైన మనిషే? ఇంత మందిమి ఇక్కడ ఉండగా వాళ్ళను మా ఇంటికి రండి అంటూ తీసుకెళ్ళటంలో అతని ఉద్దేశ్యం ఏమిటో?" అన్నాడు రంగనాథరావు.

నిజానికి రంగనాథరావును ఇందాకటి దృశ్యం భయకంపితుడ్ని చేసింది. అతనికి వెంటనే అతని భార్య జ్ఞాపకం వచ్చింది. చాలాకాలంగా పేకాట మానెయ్యమని సుశీల తనతో పోట్లాడుతున్నది. ప్రతిరోజూ తను పదో, పాతికో పోగొట్టుకుని ఇంటికి వెళ్తున్నాడు. తనకు నెలకు ఆరువందలు జీతం వచ్చినా సరిపోవటంలేదు, ఊరి నిండా అప్పులే. ట్యూషన్స్‌చెప్పి కొంత డబ్బు సంపాదించినా అదీ సరిపోవటం లేదు. పేకాట మానెయ్యమని సుశీల తన కాళ్ళు పట్టుకుంది, యేడ్చింది. బావిలో దూకుతానంది. విషం మింగి చస్తానంది. అయినా తను పేకాట మానడం గాని, క్లబ్బుకు రాకుండా ఉండటంగానీ చెయ్యలేకపోయాడు. ఎప్పుడో అప్పుడు సుశీలకూడా నర్సయ్య భార్యలా క్లబ్ దాకా వచ్చి ఇంతమంది ముందు తన పరువు తీస్తే తన గతేం కావాలి. రంగనాథరావు తన భార్య క్లబ్‌కు రావటాన్ని ఊహించుకొని వణికిపోయాడు.

ఈ మధ్య రంగనాథరావు 'గెయిన్'లో ఉంటున్నాడు. అందుకు కారణం ప్రతాపరెడ్డి ఊహించినట్టు అతడు కొంత 'మెస్మరిజం' చెయ్యటమే. రెండు మూడు రోజులు తీవ్రంగా ఆలోచించి రంగనాథరావు తను పేకాటలో గెలవటానికి ఒక పద్ధతి కనిపెట్టాడు. ఇంటి నుండి వచ్చేటప్పుడు కొన్ని కార్డ్సు జేబులో వేసుకొని క్లబ్‌కు రావటంలో ఎవరూ చూడనప్పుడు సీక్వెన్స్ చేసెయ్యటం—ఇదీ అతడు చేస్తున్న మెస్మరిజం. ఎవరన్నా చూస్తే అన్న సందేహం అతనికి కలక్కపోలేదు. కాని అతడు క్లబ్‌లో చాలా డబ్బు పోగొట్టుకున్నాడు. ఆ డబ్బంతా సంపాదించుకోవాలంటే ఇంతకంటె మరో మార్గం అతనికి కన్పించలేదు. రెండుమూడు సార్లు అలాచేసి రమ్మీచేశాడు. ఎవరూ చూడకపోవడంతో అతనికి చాలా ధైర్యం గల్గింది.

"నిజమే ఈ మోహనరావు కొంచెం Eccentric గా కనిపిస్తున్నాడు." అన్నాడు సాంబయ్య.

"Eccentric లేదు, పాడూలేదు ఫోజు. ఇంతమందిలోను తనే మొనగాడినన్న ఫోజు. తలతిక్క. లేకపోతే అశోక్‌రెడ్డి అంతటి వాడితో తలపడ్తాడా. చీమను నలిపినట్లు నలిపేస్తాడు. అసలు సంగతేమిటంటే వాడికి మనందరం అంటే చాలాకోపం. మనం ట్యూషన్స్‌మీద బోలెడు డబ్బు సంపాదిస్తున్నామని వాడి యేడుపు. తనను సంపాదించుకోక ఎవడొద్దన్నాడు. పరీక్షలో మనమంతా లూజుగా ఉంటామని ప్రచారం చేస్తాడు. వాడు పెద్ద ఫోజుకు పోయి స్ట్రిక్టుగా ఉండబోతే బజార్లో పట్టుకొని తన్నారు" అన్నాడు ప్రతాపరెడ్డి.

"యేమిటి? మోహనరావును స్టూడెంట్స్ తన్నారా?"

ఆశ్చర్యం, ఆనందం ధ్వనించింది సాంబయ్య కంఠంలో.

"ఔను మీకు తెలియదా, తల పగిలిపోయింది. ఆ దెబ్బతో చస్తాడనుకున్నాము. కాని మొండి ఘటం అంత చచ్చేటట్టు దెబ్బలు తిన్నా వాడిప్పటికీ పరీక్షల్లో స్ట్రిక్టుగానే ఉంటాడు. ముఖ్యంగా మన దగ్గర ట్యూషన్ చదువుకున్న బోయ్స్ ఉంటారే....వాళ్ళ విషయంలో మరీ స్ట్రిక్టుగా ఉంటాడు....ఈ సారసలు వాణ్ణి కైలాసం పంపించేస్తారు...." అన్నాడు కసిగా ప్రతాపరెడ్డి.

"అయినా అతని పూలిష్‌నెస్ కాకపోతే ఈ రోజుల్లో స్ట్రిక్టేమిటి, పరిస్థితులకు తగ్గట్టుగా నడుచుకోవాలి. కాపీయింగ్ అనేది ఆర్డర్ ఆఫ్ ది డే అయింది. దాన్ని ఆపుతాననుకోవటం మూర్ఖత్వం!" అన్నాడు సాంబయ్య.

"భేష్! చిన్న వాడివైనా చాలా బాగా చెప్పావు" అంటూ టేబుల్ కింద చేతులుపెట్టి కార్డ్సు మారుస్తున్న రంగనాథరావును ప్రతాపరెడ్డి చూశాడు. వెంటనే కస్సుమని లేచాడు.

"కాని, మీరు చేస్తున్న పని మాత్రం యేమీ బాగాలేదు మిష్టర్ రంగనాథరావు. కార్డ్సు కింద పడెయ్యండి ... ఆ కార్డు ఎక్కడిది జేబులోంచి తీశారుకదూ, నిజం చెప్పండి," అన్నాడు ప్రతాపరెడ్డి ఆక్లబ్బంతా వినిపించేలా. రంగనాథరావు గుండె ఆగిపోయింది.

"ఏమిటి....ఏమిటి మీరంటున్నది" అన్నాడు తడబడ్తూ.

"నీళ్లు నమలకండి. You are caught red handed. మీరు ఇంత దిగజారి పోతారనుకోలేదు. లెక్చరర్‌గా పనిచేస్తున్న ఓ గెజిటెడ్ ఆఫీసర్ ఇంత నీచానికి దిగజారటమా! ఛా! కమాన్. తియ్యండి.... జేబులో ఇంకెన్ని కార్డ్సు ఉన్నాయో తియ్యండి" అన్నాడు ప్రతాపరెడ్డి నిర్దాక్షిణ్యంగా.

వణుకుతున్న చేతులతో రంగనాథరావు జేబులో ఉన్న కార్డ్సును టేబుల్‌మీద పెట్టాడు. క్లబ్‌లో ఉన్నవాళ్ళంతా రంగనాథరావు జేబులోంచి వచ్చిన కార్డ్సునుచూసి హా హా అన్నారు. అటుకేసేచూస్తున్న అశోక్‌రెడ్డి "ఈ లెక్చరర్స్ వట్టి రోగ్స్ ఈ క్లబ్ పేరు నాశనం చేస్తున్నారు. యేమయ్యా రంగనాధరావు.... సిగ్గులేదు ఫౌల్‌గేమ్ ఆడ్తావా? ఇంతకంటె ఉరేసుకొని చావరాదూ? మీ లాంటివాళ్ళను క్లబ్‌కు ఎలౌ చేయటమే మా బుద్ధి తక్కువ—గెటవుట్—మళ్ళి ఈ క్లబ్‌కొచ్చారా మీ మర్యాద దక్కదు గెటవుట్ ఐ సెడ్" అన్నాడు అశోక్‌రెడ్డి.

రంగనాథరావుకు నోటమాట రావటంలేదు. లేచి నిలబడలేకపోతు న్నాడు. తన కాళ్ళలో సత్తువపోయింది. యేదో వూబిలో కూరుకుపోతు న్నట్టనిపించింది. తనకేదో పక్షవాతం వచ్చి కాళ్ళు చేతులు పడిపోయా యనిపించింది.

"మీకే చెప్పేది—లేపరేం" అన్నాడు అశోక్‌రెడ్డి.

క్లబ్‌లో వాళ్ళందరి కళ్లు అతనికేసే చూస్తున్నాయి.

"పూర్ ఫెలో" అనుకున్నారు కొందరు.

"బ్లడీ రోగ్" అన్నారు కొందరు.

"వీళ్లు లెక్చరర్స్‌ట స్టూడెంట్స్ నాశనమై పోతున్నారంటే పోకేం చేస్తారు" అన్నారు ఇంకా కొందరు.

శరీరంలోని బలాన్నంతా కూడదీసుకొని లేచాడు రంగనాథ రావు.

"దొంగ రమ్మీలు చేసి మా దగ్గర తీసుకున్న డబ్బు మాటేం కావాలి ఆ డబ్బంతా కక్కి మరీపో." అన్నాడు ప్రతాపరెడ్డి.

"మిష్టర్ ప్రతాప్, You settle your accounts afterwards అతన్ని వెళ్ళిపోనివ్వండి" అన్నాడు అశోక్‌రెడ్డి.

బాగా తాగిన వాడిలా తూలుతూ బయటకు నడిచాడు రంగనాథ రావు. బయట స్కూటర్ స్టార్ట్ అయిన చప్పుడైంది.

"ఈయన క్షేమంగా ఇల్లు చేరతాడా," అన్న అనుమానం కల్గింది రంగడికి.

"ఏమిటి ప్రతాప్—మీ లెక్చరర్స్‌లో యింత రోగ్స్ ఉన్నారా?" అన్నాడు అశోక్‌రెడ్డి.

"ఉన్నారు. యేం చేస్తాం. వీడ్ని మూడు నాల్గు రోజులుగా గమనిస్తున్నాను. ఈజీగా రమ్మీ చేసేస్తున్నాడు. వీడు న్యాయంగా ఆడితే వీడి జన్మలో రమ్మీ చెయ్యలేడని నాకు తెలుసు. వట్టి మఫ్. అందుకే వాడి మీద ఓ కన్నేసి ఉంచాను. ఇవ్వాళ దొరికాడు" అన్నాడు ప్రతాపరెడ్డి.

"ఇవ్వాళ క్లబ్‌లో అన్నీ సీన్స్, చాలా Exciting గా ఉంది" అన్నాడు డాక్టర్ సంతోషరెడ్డి ఆవులిస్తూ.

"నిజంగా ఈ లెక్చరర్స్ ఇంత దొంగలనుకోలేదు" అన్నాడు ఆనందరావు కూడా ఆవులిస్తూ.

"ఇదేమిటి, అప్పుడే నిద్రొస్తున్నట్టుందే" అన్నాడు నరసింహా రావు.

"ఔను సార్—ఇక ఆపేద్దాం, నిద్రొస్తున్నది" అన్నాడు సంతోష్ రెడ్డి.

అప్పుడే లేవటం ఇష్టంలేదు ఆనందరావుకు చాలా గెయిన్‌లో ఉన్నాడు.

ఇంతలో వీళ్ళ టేబుల్ దగ్గరకు రంగడువచ్చి "మీకు హాస్పిటల్ నుండి ఫోనొచ్చింది సార్" అన్నాడు ఆనందరావు.

"వచ్చిందా—అనుకుంటూనే ఉన్నాను—యేమి సంగతో నువ్వే కనుక్కో పో" అన్నాడు ఆనందరావు.

రంగడు పరుగెత్తాడు. ఈ లోగా ఆనందరావు మరోసారి రమ్మీ చేశాడు.

రంగడు పగెరుత్తుకొని వచ్చాడు.

"ఏదో సీరియస్ కేసటసార్. నర్స మిమ్మల్ని వెంటనే రమ్మంటున్నది. లేకపోతే ఏదన్నా ప్రమాదం జరగొచ్చునట" అన్నాడు రంగడు.

"దొంగలంజ దాంతో వందసార్లు చెప్పాను. క్లబ్‌లో ఉన్నప్పుడు నన్ను డిస్టర్బ చెయ్యొద్దు అని. ఒరే రంగడు. ఇప్పుడు రెండు గంటలు కావస్తోంది. డాక్టర్‌గార్కి బాగా నిద్రవస్తున్నదట ఇంటికెళ్ళిపోతున్నాడు. నిన్నే ఏదన్నా ఇంజెక్షన్ యివ్వమన్నాడు. రేపొచ్చి చూస్తారు అని చెప్పు పో" అన్నాడు ఆనందరావు. రంగడు వెళ్ళిపోయాడు.

"ఇంకో రౌండ్ వేద్దామా?" అన్నాడు ఆనందరావు, నరసింహారావు, సంతోష్‌రెడ్డి ఖాళీ పాకెట్స్ చూపించారు.

"బాగా నిద్రొస్తున్నది. పర్స్‌కూడా ఖాళీ అయిపోయింది. ఇక లేద్దాం" అన్నాడు నరసింహారావు.

"ఆల్‌రైట్ లేద్దాం మెజార్టీని కాదంటానా" ఆనందరావు లేచాడు. అప్పటికే క్లబ్బంతా పల్చబడింది. డాక్టర్స లేవటంతో మిగతావాళ్ళంతా లేచారు. లెక్చరర్స్‌కూడా లేచారు. విస్కీబాటిల్ పూర్తిచేసి అశోక్‌రెడ్డి లేచాడు.

బయట కార్లు, జీప్‌లు, స్కూటర్లు స్టార్ట్ అయిన చప్పుడైంది.

"అమ్మయ్య" అని నిట్టూర్చాడు రంగడు.

లైట్లన్నీ ఆఫ్‌చేసి క్లబ్ తలుపులన్నీ మూసి తాళంవేసి బయట పడ్డాడు రంగడు.

ఈ రోజు క్లబ్‌లో చాలా వింతలే జరిగాయి. కాని తనకు జీతం మాత్రం రాలేదు. క్లబ్ సెక్రటరీగారు రాలేదు. అశోక్‌రెడ్డి నిష్కారణంగా తన్నాడు. కలెక్టరు పెళ్ళాం కోపంతో వెళ్ళిపోయిందన్న కోపాన్ని తనమీద వెళ్ళదీశాడు. క్లబ్‌బోయ్ అంటే అందరికీ లోకువే—అందుకు కారణం తను పేదవాడు కావటమే—ఎప్పుడైనా తన పరిస్థితులు మారి తను బాగా డబ్బు సంపాదించే రోజులు వస్తాయా? తను ఆంధ్రా మెట్రిక్‌ప్యాసై. కాలేజీలోచేరి బి. ఏ లు, ఎం. ఏ లు చదివే రోజులు వస్తాయా ఆ రోజులేమో కాని రంగడి గుడిసెమాత్రం వచ్చింది. వాళ్ళమ్మవచ్చి తలుపు తీసింది. ఓ మూల చింకిచాపేసుకుని పడుకున్నాడు వాడికి నిద్రవచ్చేసింది.